


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

25.09.2026
శుక్రవారం | రంగారెడ్డి
సంపుటి : 01 | సంచిక: 86
పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి

- సీజేపీ సంచలన డిమాండ్
- కోట్ల కొద్దీ ఓట్లను తొలగించారు
- అభిజీత్ దిప్కే డిమాండ్
- 48 గంటల్లో రాజీనామా చేయకపోతే..
- దేశవ్యాప్త నిరసనలు చేపడతామని హెచ్చరిక

2లో..



## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై అభిశంసన తీర్మానం

- విపక్షాల సంచలన నిర్ణయం
- పదవి నుంచి తొలగించేందుకు కూటమి సిద్ధం
- పార్లమెంట్ ఉభయ సభల్లో కూటమి వ్యూహం
- కాంగ్రెస్ నేతృత్వంలో వ్యూహం రచిస్తున్నాయి

2లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

దేశంలో ఓటర్ల జాబితా సవరణ, ఓట్ల తొలగింపు అంశం తీవ్ర రాజకీయ దుమారం రేపుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్న ప్రతిపక్షాలు.. ఏకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్‌పై పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని నిర్ణయించాయి. వచ్చే రెండు వారాల్లో ఉభయ సభల్లోనూ దీనికి సంబంధించిన నోటీసు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ విపక్షాలను ఏకతాటిపైకి తెస్తోంది.

**ఇండియా కూటమి సంయుక్త వ్యూహం**

ఈ అభిశంసన నోటీసు ముసాయిదాను ప్రస్తుతం న్యాయ నిపుణులు పరిశీలిస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ప్రతిపక్ష ఇండియా కూటమి కలిసికట్టుగా ఈ నోటీసును సిద్ధం చేస్తోందని పేర్కొన్నాయి. సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను తొలగించేందుకు విపక్షాలు ప్రయత్నించడం ఇది మూడోసారి కావడం గమనార్హం. గతంలో లోక్‌సభ, రాజ్యసభల్లో ఇచ్చిన మొదటి నోటీసు తిరస్కరణకు గురికాగా, ఏప్రిల్ 24న 73 మంది ఎంపీలు ఇచ్చిన మరో నోటీసు రాజ్యసభలో పెండింగ్‌లోనే ఉంది. అయితే, ఓటర్ల జాబితాల సవరణలో జరుగుతున్న అక్రమాలపై కథనం వెలుగులోకి రావడంతో విపక్షాలు కొత్తగా మరొకసారి అభిశంసన తీర్మానం ఇవ్వాలని నిర్ణయించాయి.

## రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్’

- రేవంత్‌కు ‘బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026’ అవార్డు
- రైతులు, బీసీ సంక్షేమానికి గుర్తింపుగా ఎంపిక
- నిలంబూర్‌లో రేపు అవార్డు ప్రదానోత్సవం
- రూ.లక్ష నగదు.. ప్రశంసా పత్రం, జ్ఞాపిక

**హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ అందజేసే ప్రతిష్టాత్మక ‘ఆర్యదాన్ ముహమ్మద్ – 2026’ బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు సీఎం రేవంత్ రెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు (బీసీలు), సామాన్య ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల పరిపాలనా వైఖరికి ప్రాధాన్యమిస్తూ ఈ గౌరవ పురస్కారాన్ని ప్రకటిస్తున్నట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ వెల్లడించారు.**



**రైతు, బీసీ సంక్షేమ పాలనకు ప్రాధాన్యత.. జ్యూరీ ప్రశంసలు**

ఈ అవార్డు ఎంపిక ప్రక్రియలో ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ సభ్యులుగా ఉన్న ఉన్నత స్థాయి జ్యూరీ వ్యవహరించింది. తెలంగాణను ప్రగతిపథంలో నడిపించడంలో సీఎం రేవంత్ రెడ్డి కనబరిచిన దూరదృష్టి, ప్రజాస్వామిక విలువల పట్ల ఆయనకున్న అపారమైన నిబద్ధతను జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది. ప్రజా సంక్షేమమే పరమావధిగా సాగుతున్న పాలనకు గుర్తింపుగానే ఈ అంతర్రాష్ట్ర పురస్కారం దక్కిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

**అవార్డు ప్రదానోత్సవం.. ఏఐసీసీ కీలక నేతల హాజరు**

ఆర్యదాన్ ముహమ్మద్ నాల్గవ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అత్యంత ఘనంగా ప్రదానం చేయనున్నారు. ఈ పురస్కారం కింద రూ. లక్ష నగదు బహుమతితో పాటు విశేష ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. ఈ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేయనున్నారు.

**ప్రజానేత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఏర్పాటు**

**కేరళ రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన సీనియర్ కాంగ్రెస్ నేత ఆర్యదాన్ ముహమ్మద్ ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికవడమే కాకుండా, వివిధ మంత్రివర్గాల్లో నాలుగుసార్లు కీలక శాఖలకు మంత్రిగా సమర్థవంతమైన సేవలు అందించారు. అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా, నిజాయితీ, లౌకిక విలువలకు మారుపేరుగా కేరళ ప్రజల గుండెల్లో నిలిచిపోయిన ఆయన స్మారకార్థం ఈ అవార్డును నెలకొల్పారు. అటువంటి మహనీయుడి పేరిట ఏర్పాటైన ఉత్తమ ప్రజా సేవకుడి పురస్కారానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎంపిక కావడం విశేషం.**

## నిమజ్జనం విధుల్లోని ఎస్ఐ వెంకన్న మృతి

సంతాపం తెలిపిన సీఎం రేవంత్



5లో..

## వంట నూనెలపై గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

- పండుగలకు ముందే ఊరట..
- ప్రాథమిక దిగుమతి సుంకాన్ని తగ్గించింది
- సెప్టెంబర్ 24, 2026 నుంచి అమల్లోకి
- 32.5 శాతం నుంచి 27.5 శాతానికి తగ్గించారు

2లో..

## లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించండి

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- కాకినాడలో భారీ వర్షా ల నేపథ్యంలో..
- వర్షా లు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకూ
- అప్రమత్తంగా ఉండాలని సూచించారు
- కూలిన చెట్లను తక్షణమే తొలగించాలి

5లో..



**కాకినాడ సెప్టెంబర్ 24 అనంత జనశక్తి న్యూస్**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా కాకినాడ జిల్లావ్యాప్తంగా అత్యంత భారీ వర్షాలు కురుస్తుండడంతో యంత్రాంగం మరో రెండు రోజుల పాటు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## పెట్టుబడులు పెట్టండి

- వైద్యపరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు చేయండి
- అబాట్‌ను కోరిన మంత్రి లోకేశ్
- ఎండీ ఇస్తేయాక్ అంజాద్‌తో నారా లోకేశ్ భేటీ
- సిస్కో ఇండియా ఎండీ హరీశ్ కృష్ణన్‌తోనూ భేటీ
- వివో, సిస్కో, అబాట్, మాస్టర్‌కార్డ్, శాప్‌కు లోకేశ్ ఆహ్వానం

5లో..



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

అమెరికాకు చెందిన ప్రముఖ వైద్య పరికరాలు, న్యూట్రిషన్ తయారీ సంస్థ అబాట్ మేనేజింగ్ డైరెక్టర్ ఇస్తేయాక్ అంజాద్‌తో ఏపీ మంత్రి నారా లోకేశ్ దిల్లీలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... వైద్య పరికరాల తయారీ యూనిట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించారు.

## రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు బెయిల్!

### ఏపీ లిక్కర్ కేసు

**అమరావతి, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

2లో..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలనం సృష్టించిన మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితులుగా ఉన్న రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు ఈడీ ప్రత్యేక కోర్టు ఉపశమనం కలిగించింది. షరతులతో కూడిన బెయిల్‌ను మంజూరు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. నిందితులు ఇద్దరూ లక్ష రూపాయలు చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు ఆదేశించింది. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి ఎక్కడికీ వెళ్లకూడదని న్యాయస్థానం స్పష్టం చేసింది.

## అసెంబ్లీకొచ్చి మాట్లాడండి

- డీఎస్సీపై అవకతవకలు జరగలేదు
- ఆధారాలుంటే చూపించాలి
- మంత్రి నాదెండ్ల మనోహర్
- మాజీ సీఎం జగన్ కామెంట్లపై ఖండన



2లో..

## రైతుల నోట్లో మట్టి కొడతారా

- పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గింపు
- కేంద్రం ప్రభుత్వంపై తుమ్మల నాగేశ్వర్ రావు ఫైర్
- వంట నూనెల ధరలను నియంత్రించేందుకు

**హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్**

తెలంగాణలో ఆయిల్ పామ్ సాగును విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతున్న వేళ.. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. క్రూడ్ పామ్ ఆయిల్‌పై దిగుమతి సుంకాన్ని తగ్గించడం వల్ల దేశీయ ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలకు నష్టం కలిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతులను ఆయిల్ పామ్ పంట వైపు ప్రోత్సహిస్తూనే.. విదేశీ పామాయిల్ దిగుమతులకు సుంకం తగ్గించడం ఏ విధంగా రైతు అనుకూల విధానమని ప్రశ్నించారు. నేటి (సెప్టెంబర్ 24) నుంచి క్రూడ్ పామ్ ఆయిల్, క్రూడ్ సోయాబీన్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గిస్తూ.. కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది.
ఇతర సుంకాలు, సెస్సులు కలిపి క్రూడ్ పామ్ ఆయిల్‌పై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి తగ్గింది.

2లో..



## ప్రజల్లో నాకు బలముంది


- ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా
- ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా..
- అదే జరిగిందని వెల్లడి
- లీగల్‌గా పోరాడటంలో తప్పలేదు

2లో..

## ఫిరాయింపు రాజకీయాలకు చరమగీతం పాడాలి

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై ఘాటు విమర్శలు
- పార్టీలోకి ఫిరాయించడం నైతికతకే మచ్చ

2లో..



## ఫిరాయింపు రాజకీయాలకు
# చరమగీతం పాడాలి



**హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్**

తాజా రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా ఫిరాయింపుల రాజకీయాలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఒక పార్టీ గుర్తుపై గెలిచి, మరో పార్టీలోకి ఫిరాయించడం నైతికతకే మచ్చ అని ఆయన మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు వెలువడినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలకు సిగ్గు రాలేదని, ఆయా రామ్, గయా రామ్ సంస్కృతిని ప్రోత్సహిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దానం నాగేందర్ వ్యవహారంలో వాస్తవాలను కప్పిపుచ్చి కొన్ని మీడియా సంస్థలు తీర్పును వక్రీకరిస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిరాయింపుల రాజకీయాలను సమర్థిస్తూ ఎవరికి వారే తమ విజయంగా చెప్పుకోవడం వారి అవకాశవాద రాజకీయాలకు నిదర్శనమని, ఈ తీర్పు ఆ రెండు పార్టీలకు చెంపపెట్టు వంటిదని స్పష్టం చేశారు.

ఈ అనైతిక రాజకీయాలకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బండి సంజయ్ పిలుపునిచ్చారు. ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమని, నైతికతను మంటకలిపిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఆ ఎన్నికల్లో పోటీ చేసే అర్హతే లేదని తేల్చిచెప్పారు. హిందూ బంధువులు, ప్రజలంతా ఏకమై ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న ఈ రెండు పార్టీలను రాజకీయంగా నిమజ్జనం చేయాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఏ రాజకీయ పార్టీ కూడా ఇలాంటి అనైతిక చర్యలకు పాల్పడకుండా ప్రజలే గట్టి గుణపాఠం చెప్పాలని, ఈ ఎన్నికల ద్వారా అలాంటి బలమైన సంకేతాలను పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రజల్లో నాకు బలముంది



**హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్**

ఎమ్మెల్యే పదవికి అనర్హత అంశంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు దానం నాగేందర్ తెలిపారు. ప్రజాక్షేత్రంలో తనకు బలముందని చెప్పారు. అనర్హత వేటుపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దానం సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఆయన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం గురువారం డిస్మిస్ చేసింది. ఈ నేపథ్యంలో దానం నాగేందర్ మీడియాతో మాట్లాడారు. ‘‘ఎంపీగా పోటీ చేసినప్పుడే ఊహించా.. అదే జరిగింది. లీగల్‌గా పోరాడటంలో తప్పులేదు. పదో షెడ్యూల్ ప్రకారం రిలీఫ్ దొరుకుతుందని అనుకున్నా. మళ్లీ ఎన్నికల్లో పోటీ చేసుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పింది. నేను ప్రతి ఇంటికి వెళ్లి సేవ చేశా.. నేనేంటో ప్రజలను అడిగితే తెలుస్తుంది. ఉప ఎన్నికలో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారు. గతంలో మూడుసార్లు గెలిచాను. ఒక ఉప ఎన్నికలో 1,600 ఓట్లతో ఓడిపోయాను. ఇప్పుడు పరిస్థితులు చాలా అనుకూలంగా ఉన్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలే ఇక్కడా రిపీట్ అవుతాయి. ఖైరతాబాద్ దానం నాగేందర్ అడ్డా. కలిసి పనిచేస్తాం.. తప్పకుండా గెలుస్తాం’’ అని దానం నాగేందర్ అన్నారు.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై
## అభిశంసన తీర్మానం



(మొదటి పేజీ తరువాయి)

మరోవైపు, సీఈసీ జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని, పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ సుదీర్ఘ పోరాటానికి దిగింది. సెప్టెంబర్ 25న అన్ని రాష్ట్రాల ప్రధాన నగరాల్లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయాల ముట్టడికి కాంగ్రెస్ తమ రాష్ట్ర కమిటీలను ఆదేశించింది. అలాగే సెప్టెంబర్ 28న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్ల వద్ద భారీ నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నారు. "బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తూ సీఈసీ జ్ఞానేష్ కుమార్ చేపడుతున్న 'భారీ ఓట్ల చోరీ'ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి నుంచి ఎండగడుతున్నారు. ఆయన చేసిన రాజ్యాంగ విరుద్ధ చర్యలు ఇప్పుడు బయటపడ్డాయి. ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలి" అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ విమర్శించారు.

**ఎన్నికల కమిషనర్ల మధ్య తీవ్ర విభేదాలు**

గత ఏడాది ప్రారంభమైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పది నెలల కాలంలో తోటి ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి కనీసం 14 సార్లు తమ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ కథనం స్పష్టం చేసింది. ఓటర్ నమోదు ఫారం 6 సవరణ, ఓట్ల చేరికలుతొలగింపుల నిర్వహణ, సెంట్రలైజ్డ్ డేటాబేస్‌పై సీఈసీ ఏకపక్ష ఆధిపత్యం వహించడంపై వారు ప్రశ్నించినట్లు సదరు కథనం పేర్కొంది. అయితే ఈ కథనంపై కేంద్ర ఎన్నికల సంఘం స్పందిస్తూ.. "ఒక వ్యవస్థలో వివిధ అంశాలపై విభిన్న అభిప్రాయాలు ఉండటం సహజం. ఎన్నికల వ్యవస్థను మెరుగుపరచడానికి ప్రతి అధికారికి సూచనలు ఇచ్చే హక్కు ఉంది. కమిషన్ జారీ చేసే అన్ని ఉత్తర్వులు చట్టబద్ధమైన పరిధిలోనే ఉంటాయి" అని వివరణ ఇచ్చింది.

## సీఈసీ జ్ఞానేష్ కుమార్
# రాజీనామా చేయాలి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

కేంద్ర ఎన్నికల సంఘం పనితీరుపై ప్రతిపక్షాలు, స్వచ్ఛంద సంస్థలు మండిపడుతున్న వేళ కాక్రోచ్ జనతా పార్టీ సంచలన వ్యాఖ్యలు చేసింది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా భారీ ఆందోళనలు చేపడతామని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హెచ్చరించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, సీఈసీ జ్ఞానేష్ కుమార్ భారత ప్రజాస్వామ్యానికి పెద్ద ముప్పుగా పరిణమించారని ఆరోపించారు. "48 గంటల్లో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయకపోతే జంతర్ మంతర్ 2.0 పోరాటం ఖాయం" అని అభిజీత్ దిప్కే స్పష్టం చేశారు. జ్ఞానేష్ కుమార్ సీఈసీగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఎవరికి ఓటు హక్కు ఉండాలో, ఎవరికి ఉండకూడదో ప్రభుత్వమే నిర్ణయిస్తోందని దుయ్యబట్టారు.

**13 కోట్లకు పైగా ఓట్ల తొలగింపు?**

దేశవ్యాప్తంగా మొత్తం 13 కోట్లకు పైగా ఓట్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించారని దిప్కే ఆరోపించారు. ఇది దేశంలోని మొత్తం ఓటర్లలో దాదాపు 13 నుంచి 14 శాతం వరకు ఉంటుందని తెలిపారు. 2024 లోక్‌సభ ఎన్నికలను ప్రస్తావిస్తూ.. అధికార వర్గానికి, ప్రతిపక్షాలకు మధ్య ఉన్న 2 శాతం ఓట్ల వ్యత్యాసాన్ని పెంచేందుకే ఈ తొలగింపులు చేపట్టారా అని ప్రశ్నించారు.

**ముఖ్యమంత్రుల నియోజకవర్గాల్లోనే ఓట్ల కోత**

ప్రతిపక్ష నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓట్లను తొలగించారని దిప్కే కొన్ని లెక్కలను ప్రవేశపెట్టారు.



పశ్చిమ బెంగాల్: ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నియోజకవర్గంలో 50,000 ఓట్లు తొలగించగా, ఆమె కేవలం 15,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

తమిళనాడు: ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నియోజకవర్గంలో 1,00,000 ఓట్లు తొలగించగా, ఆయన 45,000 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు.

ఢిల్లీ: మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నియోజకవర్గంలో 40,000 ఓట్లు రద్దు చేయగా, ఆయన 4,0005,000 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

కేరళ: ముఖ్యమంత్రి పినరయి విజయన్ విజయాన్ని కూడా ఓట్ల తొలగింపు అడ్డుకుందని ఆరోపించారు. "ఇవన్నీ ఊహించని యాదృచ్ఛికాలు కావు, దీని వెనుక స్పష్టమైన కుట్ర ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాన్ని పూర్తిగా తుడిచిపెట్టేస్తే దానిని స్వేచ్ఛాయుతమైన ఎన్నికలు అని ఎలా అంటారు?" అని ఆయన ప్రశ్నించారు.

**ఈసీ వర్గాల్లోనూ అసంతృప్తి**

గత ఏడాది ప్రారంభమైన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై పది నెలల కాలంలో ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కనీసం 14 సార్లు తమ ఆందోళనను వ్యక్తం చేసినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రిక నివేదించింది. అయితే వ్యవస్థల్లో అభిప్రాయ భేదాలు సహజమని, తాము తీసుకునే చర్యలన్నీ చట్టబద్ధమైనవేనని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది.

**కాంగ్రెస్ నిరసనలకు పిలుపు**

మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా సీఈసీ జ్ఞానేష్ కుమార్‌పై విరుచుకుపడింది. ఆయనను వెంటనే అరెస్ట్ చేసి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 25న అన్ని రాష్ట్రాల ఎన్నికల సంఘం ఆఫీసుల వద్ద నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కాంగ్రెస్ తమ రాష్ట్ర కమిటీలకు ఆదేశాలు జారీ చేసింది. అలాగే సెప్టెంబర్ 28న జిల్లాల వారీగా కలెక్టరేట్ల ముట్టడి చేపడతామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. సీఈసీ ఆధ్వర్యంలో జరిగిన "భారీ ఓట్ల చోరీ"ని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మొదటి నుంచి ఎండగడుతున్నారని ఆయన పేర్కొన్నారు.

# రైతుల నోట్లో మట్టి కొడతారా

(మొదటి పేజీ తరువాయి)

పండుగల సీజన్‌లో వంట నూనెల ధరలను కంట్రోల్ చేయడంతో పాటు ఆహార ద్రవ్యోల్బణాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం దేశీయ ఆయిల్ పామ్ రైతులపై ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దిగుమతి చేసుకునే క్రూడ్ పామ్ ఆయిల్ చౌకగా లభిస్తే.. దేశీయంగా ఉత్పత్తి అయ్యే ఆయిల్ పామ్ గెలల ధరలపై ఒత్తిడి ఏర్పడే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది.

ఒకవైపు దేశంలో ఆయిల్ పామ్ సాగును పెంచాలని కేంద్రం చెబుతోందని.. మరోవైపు దిగుమతులపై సుంకాన్ని తగ్గించడం వల్ల దేశీయ రైతుల్లో అనిశ్చితి ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి తుమ్మల అన్నారు. రైతులు ఒకసారి ఆయిల్ పామ్ సాగులోకి వచ్చిన తర్వాత వెంటనే పంటను మార్చుకునే పరిస్థితి ఉండదని మంత్రి గుర్తుచేశారు. ఆయిల్ పామ్ సాధారణ సీజనల్ పంట కాదని.. మొక్కలు నాటిన తర్వాత సంవత్సరాల పాటు నీరు, ఎరువులు, నిర్వహణపై పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుందని వివరించారు. ఇలాంటి దీర్ఘకాలిక పంటకు మార్కెట్, ధరల విషయంలో స్థిరత్వం అవసరమని తుమ్మల పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగును భారీగా విస్తరిస్తోందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. ప్రస్తుతం తెలంగాణలో 88,282 మంది రైతులు సుమారు 3.20 లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నారని ఇటీవల అసెంబ్లీలో తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. దేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ ముందంజలో ఉందని చెప్పారు. 202122 నుంచి రాష్ట్రంలో 2.74 లక్షల ఎకరాల్లో కొత్తగా ఆయిల్ పామ్ సాగును తీసుకువచ్చినట్లు ప్రభుత్వం తెలిపింది.



రైతులకు మొక్కల విస్తరణ, డ్రిప్ ఇరిగేషన్, ప్రాసెసింగ్ మిల్లులు, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తోందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో 4 ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ మిల్లులు పనిచేస్తుండగా.. మరికొన్ని ప్రాంతాల్లో కొత్త మిల్లుల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ఆయిల్ పామ్ రైతులకు లభించే ఫ్రెష్ ఫ్రూట్ బంచెస్ (ఎఫ్ఎఫ్‌బీ) ధర విషయంలో కూడా కేంద్రం స్పష్టమైన హామీ ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం కోరుతోంది. టన్నుకు కనీసం రూ.25 వేల ధరకు భరోసా కల్పించాలని మంత్రి తుమ్మల డిమాండ్ చేస్తున్నారు.


ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం.. ఆయిల్ పామ్ ఎఫ్ఎఫ్‌బీలకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించే విధానం ప్రకారం నెలవారీ ధర అమలు అవుతోంది. సెప్టెంబర్ మధ్యలో టన్నుకు రూ.24,025 ధర ఉన్నట్లు మంత్రి తుమ్మల అసెంబ్లీలో ప్రకటన చేశారు. భారత్ తన వంట నూనెల అవసరాల్లో గణనీయమైన భాగాన్ని దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. దేశ అవసరాల్లో దాదాపు మూడింట రెండొంతుల వెజిటబుల్ ఆయిల్ దిగుమతులపై ఆధారపడుతున్నట్లు తాజా గణాంకాలు చెబుతున్నాయి.

# వంట నూనెలపై
# గుడ్‌న్యూస్ చెప్పిన కేంద్రం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్**

ఆయిల్ ధరలు పెరిగి సామాన్యులు ఇబ్బంది పడుతుండగా.. వారికి శుభవార్త చెప్పింది కేంద్రం.. పండుగ సీజన్‌కు ముందు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వంట నూనెల ధరలను తగ్గించే చర్యల్లో భాగంగా ముడి, శుద్ధి చేసిన పామాయిల్, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని తగ్గించింది. ఈ మార్పులు సెప్టెంబర్ 24, 2026 నుంచి అమల్లోకి వచ్చాయి.. అంటే ఇవాల్టి నుంచే అమలు కానుంది.. ముడి పామాయిల్, ముడి సోయాబీన్ నూనెపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. శుద్ధి చేసిన పామాయిల్, సోయాబీన్ నూనెపై సుంకాన్ని 32.5 శాతం నుంచి 27.5 శాతానికి తగ్గించారు. ఇక ముడి పొద్దుతిరుగుడు నూనెపై సుంకాన్ని 10 శాతం నుంచి పూర్తిగా ఎత్తివేయగా, శుద్ధి చేసిన పొద్దుతిరుగుడు నూనెపై సుంకాన్ని 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించారు.

ప్రాథమిక కస్టమ్స్ సుంకంతో పాటు వ్యవసాయ మౌలిక సదుపాయాల అభివృద్ధి సెస్, సోషల్ వెల్ఫేర్ సర్‌చార్జ్‌లు కూడా వర్తిస్తాయి. తాజా మార్పుల తర్వాత ముడి పామాయిల్, సోయాబీన్ నూనెపై మొత్తం దిగుమతి సుంకం 16.5 శాతం నుంచి 11 శాతానికి, ముడి పొద్దుతిరుగుడు నూనెపై 16.5 శాతం నుంచి 5.5 శాతానికి తగ్గనుంది. గత ఏడాది కాలంలో భారత్‌లో కూరగాయల నూనెల ధరలు దాదాపు 20 శాతం పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు పండుగల సమయంలో స్వీట్లు, స్నాక్స్, వేయించిన పదార్థాలకు డిమాండ్ పెరిగే అవకాశం ఉండటంతో దిగుమతి వ్యయం తగ్గడం ద్వారా దేశీయ ధరలపై ఒత్తిడి తగ్గుతుందని అంచనా వేస్తున్నారు. అయితే తగ్గిన దిగుమతి వ్యయం ఎంతవరకు వినియోగదారులకు చేరుతుందనేది సరఫరా గొలుసుపై ఆధారపడి ఉంటుంది. భారత్ తన కూరగాయల నూనె అవసరాల్లో దాదాపు మూడింట రెండు వంతులను దిగుమతుల ద్వారా తీర్చుకుంటోంది. పామాయిల్, సోయాబీన్, పొద్దుతిరుగుడు నూనెలను ప్రధానంగా మలేషియా, ఇండోనేషియా, అర్జెంటీనా, రష్యా, ఉక్రెయిన్ వంటి దేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. తాజా సుంకాల తగ్గింపుతో రిఫైనర్లకు దిగుమతులు పెంచే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. పొద్దుతిరుగుడు నూనె ఈ నిర్ణయం వల్ల ఎక్కువ ప్రయోజనం పొందే అవకాశం ఉందని పతంజలి ఫుడ్స్ వైస్ ప్రెసిడెంట్ ఆశిష్ ఆచార్య రాయిటర్స్‌తో పేర్కొన్నారు. ఇది రిఫైనర్లకు మరింత ఆకర్షణీయంగా మారడంతో సోయాబీన్, పామాయిల్‌తో పోలిస్తే పొద్దుతిరుగుడు నూనెకు డిమాండ్ పెరిగే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మరి, ఇది వంటె నూనెల వినియోగదారులకు ఏ మేరకు ఊరట కలిపిస్తుందో వేచి చూడాలి..




# అసెంబ్లీకొచ్చి మాట్లాడండి

**అమరావతి, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్**

రాష్ట్రవ్యాప్తంగా ప్రజల్లో ఆందోళన కలిగించి, సమాజంలో ప్రాంతీయ, వర్గాల మధ్య చీలిక తీసుకువచ్చేలా వైసీపీ అరాచక చర్యలకు పాల్పడుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రతి సందర్భంలోనూ దుష్ట శక్తులతో కలిసి దురుద్దేశంతో దాడులకు తెగబడుతూ తీవ్రమైన హింసను ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడారు. సమాజంలో ఎంతో గౌరవప్రదమైన స్థానంలో ఉండే ఉపాధ్యాయులు, గురువులపైన వైఎస్ఆర్‌సీపీకి ఏమాత్రం గౌరవం లేదని స్పష్టం చేశారు. కోవిడ్ కష్టకాలంలో ఉపాధ్యాయులను కనీస మానవత్వం లేకుండా మద్యం షాపుల వద్ద డ్యూటీలకు నిలబెట్టారని, వైఎస్ జగన్‌కు ఉపాధ్యాయుల పట్ల ఉన్న గౌరవం ఏపాటిదో అది నిరూపిస్తోందని విమర్శించారు.

ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఎవరికైనా ఉంటుందని, కానీ దానికి విరుద్ధంగా దుష్ట శక్తులతో చేతులు కలిపి ప్రజాస్వామిక వ్యవస్థలపై దాడులు చేయడం సరికాదని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌కు ఏపీపీఎస్సీ , డీఎస్సీ లకు మధ్య ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలియకపోవడం శోచనీయమని ఎద్దేవా చేశారు. నిజంగా డీఎస్సీ నిర్వహణపై ఏవైనా అవకతవకలు జరిగాయని భావిస్తే, పారిపోకుండా శాసనసభకు వచ్చి ధైర్యంగా మాట్లాడాలని సవాల్ విసిరారు. గత ప్రభుత్వ హయాంలో మద్యం స్కామ్ ఏ స్థాయిలో జరిగిందో రాష్ట్ర ప్రజలందరికీ స్పష్టంగా తెలుసని అన్నారు. గత ఐదేళ్లలో ఏకంగా రూ.1.30 లక్షల కోట్ల మేర మద్యం లావాదేవీలు జరిగితే, అందులో కేవలం రూ.600 కోట్లు మాత్రమే డిజిటల్ పేమెంట్లు జరిగాయని, మిగిలిన లక్ష కోట్లకు పైగా నగదు రూపాయల్లోనే దోచుకున్నారని ఆరోపించారు. వారి హయాంలో సరఫరా చేసిన కల్తీ మద్యం తాగి ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి రాష్ట్రంలో అరాచక సంస్కృతికి బీజం వేసిందే వైఎస్ జగన్ అని మండిపడ్డారు.

గతంలో చేసిన పాపాలు తొలగించుకోవాలంటే వైసీపీ నాయకులు ప్రజల తరపున నిజాయితీగా పోరాటం చేయాలని మంత్రి సూచించారు. రాజకీయంగా ధైర్యంగా ఎదుర్కోవాలని, ప్రజా సమస్యలపై పొలిటికల్ డిబేట్ చేయాలని అన్నారు. ప్రజలు మిమ్మల్ని ఎమ్మెల్యేగా ఎన్నుకున్నది ప్రజా సమస్యలపై సభలో మాట్లాడడానికేనని, కాబట్టి వైఎస్ జగన్ వెంటనే అసెంబ్లీకి వచ్చి ప్రజాసమస్యలపై మాట్లాడాలని కోరుతున్నామన్నారు. లిక్కర్ స్కామ్, ఎక్సైజ్ కుంభకోణంలో ఈడీ పూర్తిస్థాయి రంగంలోకి దిగడంతో భయం పట్టుకుని, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికే వైఎస్ఆర్‌సీపీ నేతలు డైవర్షన్ పాలిటిక్స్ తెరిచారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న మెగా డీఎస్సీ నియామకాలు ఆపాలనే దుర్బుద్ధితోనే జగన్ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

## రాజ్ కెసిరెడ్డి,
## వాసుదేవ రెడ్డిలకు బెయిల్!

(మొదటి పేజీ తరువాయి)

ఈ కేసులో ఉన్న సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభావితం చేయడానికి లేదా ఆధారాలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించవద్దని హెచ్చరించింది. ఈడీ అధికారులు పిలిచినప్పుడల్లా విచారణకు హాజరై, దర్యాప్తునకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోర్టు ఆదేశించింది.

**బెయిల్ షరతులివే...**

వారికి బెయిల్ మంజూరు చేసినప్పటికీ న్యాయస్థానం కొన్ని కఠినమైన నిబంధనలను విధించింది. వాటి ప్రకారం నిందితులు.. దేశం విడిచి వెళ్లకూడదు. కోర్టు ముందస్తు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లడానికి వీల్లేదు. సాక్షులను ప్రభావితం చేయకూడదు. కేసుతో సంబంధం ఉన్న సాక్షులను ఎట్టి పరిస్థితుల్లోనూ బెదిరించడం గానీ, ప్రభావితం చేసే ప్రయత్నం గానీ చేయకూడదు. అలాగే వారి పాస్‌పోర్టులను అప్పగించాలి. తమ పాస్‌పోర్టులను తక్షణమే కోర్టులో డిపాజిట్ చేయాలి. విచారణకు అందుబాటులో ఉండాలి. దర్యాప్తు అధికారులు ఎప్పుడు పిలిచినా తప్పనిసరిగా విచారణకు హాజరుకావాలి. ఈ షరతులన్నింటికీ లోబడి రూ. లక్ష పూచీకత్తు కట్టాలని కోర్టు ఆదేశించింది.

**అసలు కేసు వివరాలు...**

ఏపీ మద్యం వ్యవహారంలో 20192024 మధ్య వైసీపీ ప్రభుత్వ కాలంలో మద్యం తయారీ, విక్రయాల్లో జరిగిన భారీ అవకతవకలకు సంబంధించిన వ్యవహారం. ఈ కేసులో ప్రభుత్వ మద్యం షాపుల్లో డిజిటల్ పేమెంట్స్ కావాలనే ఆపేసి, కేవలం క్యాష్ రూపంలోనే అమ్మకాలు జరిపి నిధులను పక్కదారి పట్టించారనేది ప్రధాన ఆరోపణ. అలాగే వివిధ బ్రాండ్ల మద్యాన్ని రాష్ట్రంలోకి రాకుండా అడ్డుకుని, వాటి స్థానంలో నాసిరకం బ్రాండ్లను అధిక ధరలకు విక్రయించారని, అధికార పార్టీ పెద్దలు, కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి గుత్తాధిపత్యం చెలాయించి భారీగా లబ్ధి పొందారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మద్యం సిండికేట్ ద్వారా వచ్చిన వేల కోట్ల రూపాయల బ్లాక్ మనీని పలు డొల్ల కంపెనీలకు మళ్లించారని ఆధారాలు సేకరిస్తోంది. ప్రస్తుతం ఈ కుంభకోణంపై రాష్ట్ర సీఐడీ తో పాటుగా, మనీ లాండరింగ్ కోణంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నాయి. మాజీ ఎండీ వాసుదేవరెడ్డి, చార్టర్డ్ అకౌంటెంట్ రాజ్ కేసిరెడ్డి తదితరులపై కేసులు నమోదు చేసి పలుమార్లు విచారించడం జరిగింది.



అనంత జనశక్తి
జనం కోసమే మా అక్షరం



# సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0'! సీజేపీ

ఎన్నికల సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

''రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?'' అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు. సీజేపీ కోకన్వీనర్ సౌరవ్ దాస్ మాట్లాడుతూ.. మూడు డిమాండ్లను ఈసీ ముందు ఉంచుతున్నామని చెప్పారు. సీఈసీ రాజీనామా చేయడంతోపాటు ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలన్నారు. సర్‌ను నిలిపివేసి 2025 ఓటర్ల జాబితానే పరిగణనలోకి తీసుకోవాలని, సర్‌కు సంబంధించిన ఫైళ్లన్నింటినీ సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆధీనంలో ఉంచాలని కోరారు.



# 'మారిషస్‌ను శుభ్రంగా ఉంచుతున్నారు.. మరి భారత్‌లో ఎందుకీ దుస్థితి?'





పరిసరాల పరిశుభ్రతను పాటించే విషయంలో భారత్, మారిషస్‌లను పోలుస్తూ ఓ భారతీయ కంటెంట్ క్రియేటర్ చేసిన పోస్టు నెట్టింట వైరల్‌గా మారింది. మారిషస్‌లో భారత సంతతి ప్రజలు అధిక సంఖ్యలో ఉన్నారని.. అక్కడివారు స్వచ్ఛతను పాటిస్తుండగా, మరి భారతీయులు ఎందుకు వెనుకబడ్డారని ఆయన ప్రశ్నించారు. మారిషస్‌లో పర్యటించిన విశాల్ భార్గవ అనే క్రియేటర్.. అక్కడ తనకు ఎదురైన అనుభవాన్ని వీడియోలో పంచుకున్నారు.

''మారిషస్‌ను పరిశుభ్రంగా ఉంచుతున్న భారతీయులు.. భారత్ విషయంలో ఎందుకు ఆ పని చేయడం లేదు? మారిషస్‌లో 70 శాతం మంది భారత సంతతికి చెందిన వారే. కానీ, ఆ దేశం చాలా క్లీన్‌గా ఉంది. ఎవరూ ఎక్కడపడితే అక్కడ చెత్త వేయరు. చెత్తకుండీలను వాడతారు. బీచ్‌లు చాలా శుభ్రంగా ఉంటాయి. అయితే.. అది చాలా చిన్న దేశమని, కేవలం 12 లక్షల జనాభా ఉందని వాదించవచ్చు. మన దేశంలోని గోవాను తీసుకున్నా పరిశుభ్రత అంతంతే. వాస్తవానికి భారతీయులు పౌరస్పృహ లేనివారు కాదు. అయినప్పటికీ.. మన దేశంలో ఎందుకీ దుస్థితి నెలకొంది?'' అని విశాల్ భార్గవ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

ఈ వీడియో ఆన్‌లైన్‌లో చర్చకు దారితీసింది. భారతీయులు కూడా నిబంధనలు పాటిస్తారని, కానీ అధికార యంత్రాంగం వాటిని కఠినంగా అమలు చేయాల్సి ఉంటుందని ఒకరు పేర్కొన్నారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో మరిన్ని చెత్తబుట్టలను అందుబాటులో ఉంచాలని మరొకరు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అనేది ఇంటినుంచే మొదలుకావాల్సిన పాఠమని.. పెద్దలు చేసినట్లే పిల్లలు కూడా చేస్తారని పలువురు చెప్పారు. పౌర స్పృహను పెంపొందించడంలో పాఠశాలలు ప్రధాన పాత్ర పోషించాలన్నారు.

# శబరిమలలో బంగారు కిరీటం మాయమైందా..? వార్తల్లో నిజమెంత..!

ప్రసిద్ధ శబరిమల ఆలయం మరో వివాదంలో చిక్కుకుంది. ఈ ఆలయ సన్నిధానం నుంచి బంగారు కిరీటం మాయమైందంటూ కథనాలు వెలువడుతున్నాయి. అయితే, ఇందులో నిజం లేదని, స్వర్ణ కిరీటం భద్రంగా ఉందని ఆలయ తిరువాభరణం కమిషనర్ చెప్పడం గమనార్హం. అసలేం జరిగిందంటే..?

శబరిమల ఆలయంలో ద్వారపాలక దేవతా ప్రతిమలకు బంగారు పూత, గర్భగుడి ద్వారాలకు స్వర్ణ తాపడం రేకులు అమర్చే వ్యవహారంలో అవకతవకలపై దర్యాప్తు జరుగుతోన్న సంగతి తెలిసిందే. ఆ కేసులో భాగంగానే హైకోర్టు ఆదేశాల మేరకు సన్నిధానంలోని తిరువాభరణం, అరణ్ములలో స్వామివారి ఆభరణాల తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లోనే ఓ బంగారు కిరీటం మాయమైనట్లు వార్తలు వచ్చాయి. దాని స్థానంలో




నకిలీది ఉంచినట్లు ఆ కథనాల సారాంశం. ఈ కిరీటాన్ని 2012లో తమిళనాడుకు చెందిన ఓ భక్తుడు కానుకగా ఇచ్చారు. అప్పుడు దాని బరువు (విలువైన అలంకరణ రాళ్లతో కలిపి) 445.78 గ్రాములు ఉండగా.. అందులో 55.7 గ్రాముల బంగారం ఉంది. అయితే, స్ట్రాంగ్ రూమ్‌లో గుర్తించిన కిరీటం బరువు కేవలం 240 గ్రాములే ఉన్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. దీంతో ఈ కిరీటం మాయం వ్యవహారం వివాదాస్పదంగా మారింది.

మీడియాలో కథనాలు రావడంతో ట్రావెన్‌కోర్ దేవస్వమ్ బోర్డుకు చెందిన తిరువాభరణం కమిషనర్ వీటిపై స్పందించారు. అవన్నీ అసత్య వార్తలని, స్వర్ణ కిరీటం భద్రంగా ఉందని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి బోర్డుకు అధికారిక నివేదిక పంపారు. 'భక్తులు ఇచ్చే కానుకలన్నింటినీ స్ట్రాంగ్ రూమ్‌ల్లోనే భద్రపరుస్తాం. అందులో బంగారు ఆభరణాలతో పాటు ఇమిటేషన్ నగలు కూడా ఉంటాయి. 2012లో కానుకగా ఇచ్చిన ఈ బంగారం కిరీటాన్ని అప్పటి నుంచి భద్రంగా దాచిపెట్టాం. కొంత గందరగోళం కారణంగా తొలుత ఈ కిరీటం మిస్ అయినట్లు భావించాం. కానీ, రిజిస్టర్‌లో వివరాలన్నీ సరిచూసిన తర్వాత.. కిరీటం భద్రంగా ఉన్నట్లు తేలింది'' అని కమిషనర్ తన నివేదికలో వెల్లడించారు.

# సిగరెట్ తాగుతూ బస్సులో మంటలను పట్టించుకోని డ్రైవర్.. సజీవదహనమైన ప్రయాణికులు

గ్రేటర్ నోయిడాలో బుధవారం అర్ధరాత్రి సమయంలో జరిగిన బస్సు ప్రమాదం ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై బస్సు ప్రయాణిస్తుండగా చెలరేగిన మంటలు.. నిమిషాల వ్యవధిలోనే మొత్తం వ్యాపించాయి. కొందరు బస్సు దూకి ప్రాణాలు దక్కించుకోగా.. ఇంకొందరు మంటల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. తొమ్మిది మంది మృతుల్లో ఒక మహిళ కూడా ఉన్నారు. స్లీపర్ బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని తొలుత భావించారు. డ్రైవర్, కండక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఎఫ్ఐఆర్ ప్రకారం.. బస్సు ప్రయాణం ప్రారంభించి 33 కి.మీ. దూరం వెళ్లిన తర్వాత డ్రైవర్ క్యాబిన్ నుంచి పొగ రావడాన్ని ప్రయాణికులు గుర్తించారు. కాలుతున్న వాసన వస్తోందని డ్రైవర్, కండక్టర్‌ను అప్రమత్తం చేశారు. కానీ, వారు పట్టించుకోలేదు, బస్సు ఆపి ఎలాంటి తనిఖీ చేయలేదని వెల్లడించారు. అప్పటికి కూడా వారిద్దరూ బస్సులో సిగరెట్లు/బీడీలు తాగడం ఆపలేదు. కొద్ది నిమిషాలకే డ్రైవర్ సీట్ వద్ద ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో భయాందోళనకు గురైన ప్రయాణికులు బస్సు ఆపాలంటూ కేకలు వేశారు. అప్పటికి కూడా వారు వాహనాన్ని ఆపకపోగా.. బెదిరించారని ప్రయాణికులు వాపోయారు. ఆ తర్వాత బస్సు అంతటా వేగంగా మంటలు వ్యాపించాయి . కానీ, అప్పటికే నష్టం జరిగిపోయింది ''రాత్రి సమయం కావడంతో మేమంతా నిద్రపోతున్నాం. బస్సు మంటల్లో చిక్కుకుందని కొందరు మావద్దకు వచ్చి నిద్రలేపారు. మేం వెంటనే కిందికి దిగాం. బస్సు అంతా పొగ అలముకుంది'' అని మరో ప్రయాణికుడు వెల్లడించారు. ''బస్సు మంటల్లో చిక్కుకున్నప్పుడు నా చేతికి ఫోన్ మాత్రమే దొరికింది. దానిని తీసుకొని కిందికి దిగాను. మిగతా వస్తువులన్నీ లోపలే కాలిపోయాయి'' అని ఓ ప్రయాణికురాలు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ బస్సు యజమానిది మధ్యప్రదేశ్ అని పోలీసులు గుర్తించారు. ఇక ఈ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు రూ.2లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి రూ.50 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సుపై రూ.1.75 లక్షల చలాన్లు పెండింగ్‌లో ఉన్నాయి. మైనర్ ఈ వాహనాన్ని నడిపినందుకు కూడా అపరాధ రుసుం విధించారు.



# సర్ వేళ.. ఏమిటీ ఎరోనెట్-ఈసీఐనెట్ రగడ!

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)తో దేశవ్యాప్తంగా ఓటరు జాబితాలో భారీ స్థాయి మార్పులు చోటుచేసుకుంటున్న వేళ ఎన్నికల కమిషన్ (ఈసీ)కు సంబంధించిన రెండు అప్లికేషన్ల పేరు ప్రధానంగా వినిపిస్తోంది. అవి ఎరోనెట్, ఈసీఐనెట్. ఈ రెండింటితో జరుగుతున్న ఓటరు జాబితా డేటాబేస్ కేంద్రీకరణ, వీటిపై రాష్ట్రాల్లో ఎన్నికల అధికారులకు ఉన్న నియంత్రణ స్థాయి గురించి స్వయంగా ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్‌సింగ్ సంధు, వివేక్ జోషీలు ఆందోళన వ్యక్తం చేసినట్లు ఓ వార్తాసంస్థ తమ కథనంలో వెల్లడించడం తాజాగా కలకలం సృష్టిస్తోంది. ఇంతకీ ఏమిటీ అప్లికేషన్లు? వాటిని ఎందుకు తీసుకొచ్చింది? అనే విషయాలను పరిశీలిస్తే..

**ఓటరు జాబితా నిర్వహణకు ఎరోనెట్**

రోనెట్, ఈసీఐనెట్ ఒకదానికొకటి ముడిపడి ఉన్నవే. కానీ ఆ రెండూ ఒక్కటి మాత్రం కాదు. ఎరోనెట్ అనేది ఓటరు జాబితా నిర్వహణ వ్యవస్థకు సంబంధించి ఎన్నికల అధికారులు ఉపయోగించే బ్యాక్‌ఎండ్ అప్లికేషన్. ఓటరు రిజిస్ట్రేషన్, మైగ్రేషన్, తప్పుల సవరణ, ఓటరు తొలగింపు వంటి ప్రక్రియలకు దీన్ని ఉపయోగిస్తారు. ఎరోనెట్‌ను ప్రవేశపెట్టకముందు రాష్ట్రాలు తమ ఓటరు జాబితాల నిర్వహణకు వేర్వేరు అప్లికేషన్లు, డేటాబేస్‌లను ఉపయోగించేవి. వాటి సంఖ్య దాదాపు 36 వరకు ఉండేది.

కేంద్రీకృత డేటాబేస్‌ను రూపొందించేందుకు ఎరోనెట్ దోహదపడింది.

దీన్ని ప్రాసెసింగ్ వ్యవస్థకు కేంద్రీకృత రూపంగా ఈసీ అభివర్ణిస్తుంటుంది.

ఒక వ్యక్తిని ఓటరు జాబితాలో చేర్చవచ్చో లేదో ఎరోనెట్ తనంతట తాను నిర్ణయించలేదు.



ఈఆర్‌వోలకు సహాయకారి

ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 ప్రకారం.. అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా తయారీకి, అందులో మార్పులకు ఓటరు నమోదు అధికారులే (ఈఆర్‌వో) బాధ్యులు. వారు మార్పులు, చేర్పుల విషయంలో నిర్ణయాలు తీసుకునేందుకు ఎరోనెట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉదాహరణకు రెండు ఎంట్రీల్లో ఒకే పేరు, వయసుతో పాటు ఇతర వివరాలూ ఒకేలా ఉన్నట్లు ఎరోనెట్ గుర్తిస్తే.. అది డూప్లికేట్ కావొచ్చని అప్రమత్తం చేస్తుంది. అంతమాత్రాన వెంటనే ఆ ఎంట్రీలను ఈఆర్‌వోలు తొలగించరు. వారి రికార్డులను పరిశీలించి.. అవసరమైతే క్షేత్రస్థాయిలో వెరిఫికేషన్ చేపట్టి.. ఆపై నిర్ణయం తీసుకుంటారు.

**ఈసీఐనెట్‌తో ఒకే గొడుగు కిందికి..**

ఈసీఐనెట్ అనేది విస్తృత ప్లాట్‌ఫామ్. దీన్ని ఈ ఏడాది జనవరి 22న ప్రారంభించారు. ఓటర్లు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఎన్నికల అధికారుల కోసం ఈసీ ఏళ్లుగా తయారుచేసిన 40కి పైగా అప్లికేషన్లు, వెబ్‌సైట్లను ఒకే గొడుగు కిందకు తీసుకురావడం ద్వారా రూపొందించిందే ఈసీఐనెట్. ఓటర్లు ఓటు నమోదు, అప్లికేషన్ల ట్రాకింగ్, ఓటరు ఐడీ కార్డుల డౌన్‌లోడింగ్, పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి సేవలకు దీన్ని ఉపయోగించుకోవచ్చు.

ఓటరు జాబితాకు సంబంధించి గతంలో ఎరోనెట్ ద్వారా నిర్వహించిన కార్యకలాపాలను ప్రస్తుతం ఈ ప్లాట్‌ఫామ్‌లో కలిపారు.

సులువుగా చెప్పాలంటే ఎరోనెట్‌ను ప్రత్యేకంగా ఓటరు జాబితాల నిర్వహణకు రూపొందిస్తే.. ఈసీఐనెట్‌లో ఓటరు జాబితాల నిర్వహణతో పాటు ఎన్నికల సంబంధిత ఇతర సేవలనూ సమ్మిళితం చేశారు.

**నియంత్రణ లేకపోవడమే సమస్య!**

**ఓటరు జాబితాలను కేంద్రీకృత డిజిటల్ వ్యవస్థ ద్వారా నిర్వహించడం కొత్తేమీ కాదు. అయితే ఆ కేంద్రీకరణ స్థాయిపై ప్రస్తుతం ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఓటరు జాబితాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకునే అధికారులు ఎరోనెట్, ఈసీఐనెట్‌లపై తగినంత నియంత్రణ కలిగి ఉన్నారా అన్నది అందులో ముఖ్యమైనది. గోవాలో సర్ సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను ఇక్కడ ప్రస్తావించవచ్చు. ఆ రాష్ట్రంలో కొందరు ఓటర్ల విషయంలో వైరుధ్యాలను (పాత, ప్రస్తుత జాబితాల్లో పేర్లు వేర్వేరుగా ఉండటం.. తల్లిదండ్రులు-పిల్లల మధ్య వయసు భేదం నమ్మశక్యంగా లేకపోవడం వంటివి) డేటాబేస్ గుర్తించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన అనంతరం.. అందులోని 97 మంది తుది ఓటరు జాబితాలో చేర్పునకు అర్హులేనని ఈఆర్‌వోలు గుర్తించారు. అయితే వారి పేర్లను ఓటరు జాబితాలో పునరుద్ధరించేందుకు ఆప్షన్ వారికి అందుబాటులో లేదు. దీంతో రోల్‌బ్యాక్ ఆప్షన్ కోసం గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఈసీకి విన్నవించాల్సి వచ్చింది.**

# జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్షాలు సిద్ధం!




ఎన్నికల సంఘంలో విభేదాలున్నట్లు ఇటీవల జాతీయ మీడియాలో కథనాలు రావడంతో విపక్షాలు అప్రమత్తమయ్యాయి. ఈ క్రమంలో ప్రధాన ఎన్నికల కమిషనరు జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఉభయ సభల్లో తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి తీర్మానం ముసాయిదాను రూపొందించే పనిలో నిమగ్నమయ్యాయని, న్యాయ నిపుణుల పరిశీలన అనంతరం వారం రోజుల్లో ఈ నోటీసులు ఇవ్వనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. సీఈసీపై నోటీసులకు సంబంధించి జాతీయ స్థాయిలో విపక్షాలు కలిసి పని చేస్తున్నాయని తెలుస్తోంది. అయితే, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్న విపక్షాలు.. పార్లమెంటులో తీర్మానం ప్రవేశపెట్టడం మూడోసారి కావడం గమనార్హం. గతంలో ఓసారి ఉభయ సభల్లో నోటీసులు ఇచ్చినప్పటికీ అవి తిరస్కరణకు గురయ్యాయి. ఆ తర్వాత సీఈసీని తొలగించాలని కోరుతూ ఏప్రిల్ 24న 73 మంది విపక్ష ఎంపీలు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా.. ప్రస్తుతం అది రాజ్యసభలో పెండింగులో ఉంది. తాజాగా ఎన్నికల కమిషన్‌లో భిన్నాభిప్రాయాల అంశం తెరమీదకు రావడంతో ప్రధాన కమిషనరు తొలగింపునకు విపక్షాలు మరోసారి ప్రయత్నాలు మొదలుపెట్టాయి.

# యూపీ వ్యాపారవేత్త వినీత్ మనోచా హత్య కేసులో ట్విస్ట్



ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యాపారవేత్త వినీత్ మనోచా (60) హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కిరాయి హంతకుడితో తండ్రిని చంపించినట్లు కుమారుడు సుబ్రత్ మనోచా అంగీకరించాడు. ఈ హత్యతో తన భార్య షాలు మనోచాకు ఎలాంటి సంబంధం లేదని తెలిపాడు. అంతకుముందు సుబ్రత్ పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో.. భార్యే తన తండ్రిని హత్య చేయించిందని పేర్కొన్నాడు. కిరాయిహంతకుడిని నియమించి చంపించిందని ఆరోపించాడు.

అయితే, అతడి ప్రవర్తన, ఇతరులు ఇచ్చిన సమాచారం ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు.. నిందితులు షాలు, మాజీ ఉద్యోగి విశాల్ గౌతమ్‌లతోపాటు సుబ్రత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ క్రమంలో అతడు నేరాన్ని అంగీకరించాడు. తానే విశాల్‌కు డబ్బులిచ్చి హత్య చేయించానని, ఒకవేళ పట్టుబడితే భార్య పేరు చెప్పాలని కోరానని పోలీసులకు చెప్పాడు. పోలీసులు షాలుకు క్లీన్ చిట్ ఇవ్వలేదు. ఈ ఘటనలో ఆమె పాత్రపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఆస్తి కోసమే హత్య చేయించాడా? ఇంకేమైనా కారణాలు ఉన్నాయా అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. విశాల్ సమాచారం ప్రకారం.. వినీత్ మనోచాకు వేరే మహిళతో సంబంధం ఉంది. ఆమెకు పుట్టిన పిల్లలకు ఆస్తిని రాసేస్తాడనే ఉద్దేశంతో.. ముందుగానే తండ్రిని హత్య చేసేందుకు సుబ్రత్ పన్నాగం పన్నినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

# భర్తను వదిలి వెళ్లి విడాకులు పొందిన మహిళ పోషణ ఖర్చుకు అర్హు రాలే



అలహాబాద్ హైకోర్టు

**వివాహబంధం వదిలి వెళ్లిన కారణంగా విడాకులు పొందిన మహిళ తన మాజీ భర్త నుంచి పోషణ ఖర్చులు కోరేందుకు అర్హురాలేనని అలహాబాద్ హైకోర్టు స్పష్టం చేసింది. అయితే పోషణ ఖర్చులు కోరే మహిళ తిరిగి వివాహం చేసుకోకపోవడంతోపాటు తనను తాను పోషించుకోలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడే మాజీ భర్త నుంచి ఆ ఖర్చులు కోరేందుకు అర్హత ఉంటుందని తెలిపింది. పోషణ ఖర్చుల కోసం తాను చేసిన అభ్యర్థనను తోసిపుచ్చుతూ సుల్తాన్‌పుర్ ఫ్యామిలీ కోర్టు వెలువరించిన తీర్పుపై సునీత అనే మహిళ రివిజన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా లఖ్‌నవూ బెంచికి చెందిన జస్టిస్ రామ్ మనోహర్ నారాయణ్ మిశ్ర ఈ వ్యాఖ్యలు చేశారు. సునీత సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 కింద 2009లో పోషణ ఖర్చుల కేసు దాఖలు చేశారు. తన భర్త, మెట్టినింటికి చెందిన ఇతర సభ్యులు అదనపు కట్నం కోసం వేధించారని, అదనంగా రూ 1 లక్ష కోరడమేకాక మోటార్ సైకిల్, కలర్ టెలివిజన్ తేవాలని డిమాండ్ చేశారని ఆరోపించారు. ఈ ఆరోపణల్ని తిరస్కరించిన భర్త ఆమె తనను విడిచి వెళ్లిందని, తనతో కలిసి జీవించడానికి ఇష్టపడటం లేదని కోర్టుకు తెలిపారు. భర్త 2014, సెప్టెంబరు 25న ఎక్స్‌పార్టె విడాకుల డిక్రీ పొందారు. తదనంతరం భర్త తిరిగి వివాహం చేసుకున్నారనడానికి సాక్ష్యాలున్నాయని హైకోర్టు పేర్కొంది. సీఆర్‌పీసీలోని సెక్షన్ 125 కింద నిర్వహణ ఖర్చులు కోరే మహిళను, ఆమె భర్తను విడిచివెళ్లిన కారణంగా విడాకులు పొందినప్పటికీ, భార్యగానే పరిగణించాలని బెంచి తెలిపింది. విడాకులు పొందిన మహిళ తిరిగి వివాహం చేసుకునే వరకూ లేదా సొంత ఆదాయం సాయంతో తనను తాను పోషించుకునే సామర్థ్యం సాధించే వరకూ పోషణ వ్యయం పొందే హక్కు కలిగి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. సునీత చేసిన అభ్యర్థనను ఫ్యామిలీ కోర్టు తోసిపుచ్చడం పొరపాటని తెలిపింది. ఫ్యామిలీ కోర్టు నిర్ణయాన్ని సమీక్షించుకోవాలని ఆదేశించింది. అలాగే మహిళ మైనర్ కుమారుడు కూడా యుక్త వయసు వచ్చే వరకూ పోషణ ఖర్చులు పొందేందుకు అర్హుడని తేల్చి చెప్పింది.**



# ఆడపడుచు ఉసూరుమంటే ఆరు తరాలకు అరిష్టం

ఆడపడుచు ఉసూరుమంటే ఆరు తరాలకు అరిష్టమని నమ్మే సమాజం మనది. స్త్రీలను ఆదిపరాశక్తులుగా, లక్ష్మీ సరస్వతులకు ప్రతిరూపాలుగా కొలిచే సంస్కృతికి వారసులం మనం. ఆ ఘన వారసత్వానికి గ్రహణం పట్టిస్తూ, ఆడపిల్లలను కనీసం మనుషులుగా కూడా చూడని కిరాతకులు ఎందరో ఇప్పుడు దేశంలో స్వైరవిహారం చేస్తున్నారు. అలాంటి వారి మూలంగా తల్లి కడుపులో ఉన్నది మొదలు ఇళ్లలో, విద్యాలయాల్లో, పని ప్రదేశాల్లో.. ఇలా అన్నిచోట్లా స్త్రీలు ఎన్నెన్నో గండాలను ఎదుర్కొంటున్నారు. అబ్బాయి అయితే ఇంటిపేరు నిలబెడతాడనే కరడుకట్టిన పితృస్వామ్య భావజాల బురదలోంచి బయటికి రాలేని ప్రబుద్ధులు ఇప్పటికీ అమ్మాయిలను అమ్మ గర్భంలోనే చిదిమేస్తున్నారు. పొత్తిళ్లలోని పసిపాపల ప్రాణాలనూ బలితీసుకుంటున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించి ఎనిమిది దశాబ్దాలు అవుతున్నా అబ్బాయే కావాలనే బూజుపట్టిన దురాలోచనలు ఇంకా కొనసాగుతుండటంపై బాంబే హైకోర్టు తాజాగా తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. కొడుకుకు మళ్లీ ఆడపిల్ల పుట్టిందనే కోపంతో నెల రోజులు కూడా నిండని మనవరాలిని క్రూరంగా కడతేర్చిన ఓ వ్యక్తికి బెయిలు నిరాకరిస్తూ ఉన్నత న్యాయస్థానం ఈమేరకు స్పందించింది. నరనరానా లింగ వివక్షను నింపుకొన్న ఇలాంటి కలినాత్ములు, ఆడవారిని ఆటబొమ్మలుగా జమకట్టే అసురగణాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతుండటమే కలవరపరుస్తోంది!

చిన్నపిల్లలను దుష్టబుద్ధితో చూసేవారిని పశువులతో పోల్చాడు బద్దెన. కానీ, నోరులేని పశువులెప్పుడూ ఇలాంటి పాడుపనులు చేయవు. కాబట్టి వాళ్లని సమాజానికి పట్టిన చీడ పురుగులుగా చూడటమే సమంజసం. మొన్న జూన్‌లో తమిళనాడులో మూడేళ్ల బాలికపై అయిదుగురు అత్యాచారానికి ఒడిగట్టి ముళ్లపొదల్లో విసిరేశారు. చికిత్స పొందుతూ పాపం, ఆ చిన్నారి కన్నుమూసింది. దిల్లీలో కొద్దిరోజుల కిందట ఓ బాలికను అలాగే హతమార్చి పొలాల్లోకి విసిరేయడంతో మృతదేహాన్ని కుక్కలు పీక్కుతిన్నాయి. అభంశుభం తెలియని పిల్లలపై ఇన్నేసి దారుణాలు జరుగుతుంటే వ్యవస్థలేమి చేస్తున్నాయి? చట్టాలను చిత్తుకాగితాలుగా జమకట్టేవారిని కటకటాల్లోకి నెట్టలేని అసమర్థత- అరాచక పంచాయతీలకు ఎర్రతివాచీ పరుస్తోంది. ఝార్ఖండ్‌లో ఓ చిన్నారిపై అకృత్యానికి పాల్పడిన నేరగాడికి రూ.లక్ష జరిమానా విధించిన స్థానిక పెద్దలు... అందులో రూ.20వేలు తీసుకుని మాంసం, మద్యంతో పార్టీ చేసుకున్నట్లు ఇటీవల వెల్లడైంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో నాలుగేళ్ల బాలిక ఉసురుపోసుకున్న హేయ ఘటనలో నిందితుడిపై కేసు కట్టకపోగా, తిరిగి బాధిత తల్లిదండ్రులనే బెదిరించిన పోలీసులపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆడపిల్లలపై దాష్టీకాల పట్ల యంత్రాంగం ఎంత నిర్లిప్తంగా ఉంటోందనడానికి ఇవి నిదర్శనాలు. చిన్నారులకు రక్షణ కల్పించడంలో వ్యవస్థల వైఫల్యం కారణంగానే దేశంలో పోక్సో కేసులు ఏడేళ్లలో వంద శాతానికి పైగా పెరిగాయి. ఎన్‌సీఆర్‌బీ లెక్కల ప్రకారం గతేడాది చివరి నాటికి సుమారు రెండున్నర లక్షల పోక్సో కేసులు కోర్టుల్లో పరిష్కారానికి నోచుకోకుండా పడి ఉన్నాయి. దోషులకు త్వరితగతిన కఠిన శిక్షలు విధించడంలో ఎడతెగని జాప్యం మానవ మృగాలకు అయాచిత వరమవుతోంది!

ఇల్లాలి కంటకన్నీరొలికితే ఇంట్లో సిరి నిలవదని సుమతీ శతకకర్త హెచ్చరించాడు. ఇలాంటి హితవచనాలను చెవికెక్కించుకోని వారికి మన దేశంలో లోటేమీ లేదు. అదనపు కట్నం తేలేదనో, ఇతరత్రా కారణాలతో అత్తింట్లో మహిళలను రాచిరంపాన పెట్టే అమానుష ఘటనలు నేటికీ విపరీతంగా జరుగుతున్నాయి. 2024లో మహిళలపై చోటుచేసుకున్న మొత్తం నేరాల్లో ఇవే 27శాతం దాకా ఉన్నాయి. 2017-23 మధ్య పుణ్యభారతంలో 48వేల వరకట్న చావులు వెలుగు చూశాయంటేనే పట్టపగ్గాల్లేకుండా సాగుతున్న గృహహింస తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. ఇంట్లోంచి అడుగుబయటపెడితే చాలు- నోటికొచ్చిన అసభ్య కూతలు కూసేవారు ఇష్టారాజ్యంగా పేట్రేగిపోతుంటారు. వాళ్లకు తోడు లైంగిక దాడులకు తెగబడుతున్న నరరూప రాక్షసులు ప్రతిచోటా పొంచి ఉంటున్నారు. 2024లో దాదాపు 30వేల అత్యాచార ఘటనలు నమోదయ్యాయంటే- దేశంలో స్త్రీలకు భద్రత ఉన్నట్టా లేనట్టా? అతిపవిత్రమైన తిరువణ్ణామలై గిరి ప్రదక్షిణ మార్గంలో కూడా ఇటీవల ఇద్దరు యువతులపై ఓ ముఠా అకృత్యానికి పాల్పడిందంటే- సమాజం ఎక్కడికి దిగజారిపోతోంది?

కొన్నాళ్లుగా అమ్మాయిలు బాగా చదువుకుని ఉద్యోగ ఉపాధుల్లో కుదురుకుంటున్నారు. కానీ, పనిప్రదేశాల్లో ఎదురవుతున్న వేధింపులు వారిని వెనక్కి లాగుతున్నాయి. పదిమంది కంటే ఎక్కువ మహిళా ఉద్యోగులు ఉన్న సంస్థలన్నీ అంతర్గత ఫిర్యాదుల కమిటీలను కొలువు తీర్చాల్సి ఉన్నా, చాలాచోట్ల ఆ ఊసే ఉండటంలేదు. అందుకే, కార్యాలయాల్లో స్త్రీలపై జరుగుతున్న దౌర్జన్యాలు అసలు వెలుగులోకే రావట్లేదు. బయటికి చెప్పుకొనే అవకాశం లేక, ధైర్యం చేసి నిజం చెబితే తమ వ్యక్తిత్వాన్నే ఎక్కడ తప్పుపడతారోననే భయంతో ఎంతోమంది మిన్నకుండిపోతున్నారు. మరికొందరేమో వేధింపులు భరించలేక నాలుగు గోడలకే పరిమితమవుతున్నారు. ఇంకోవైపు పనిపాటా ఏమీ లేకుండా తప్పతాగి బలాదూర్ తిరిగే కొంతమంది యువకులు ప్రేమ పేరుతో అమ్మాయిల వెంటపడి వేధిస్తున్నారు. కాదంటే హేయ దాడులకు ఒడిగడుతున్నారు. ఇలాంటి వారి మూలంగానే ఆరేళ్లలో దాదాపు తొమ్మిది వందల యాసిడ్ దాడులు నమోదయ్యాయి. ఇంకోపక్క తమను తిరస్కరించిన అమ్మాయిల ఫొటోలను మార్ఫింగ్ చేసి వారి జీవితాలను నాశనం చేస్తున్న పైశాచిక మనస్కులు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్నారు. ఆన్‌లైన్‌లో అశ్లీల రాతలతో వెగటు వాంతులు చేసుకుంటున్నవారూ తక్కువేమీ కాదు. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే నాగరికతకే సిగ్గుచేటు! మహిళలను చెండుకుతింటున్న వారికి తక్షణం సంకెళ్లు వేయాలి. అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహహింస, పోక్సో కేసుల్లో త్వరితగతిన శిక్షలు పడేలా చూడాలి. ఎన్ని గట్టి చట్టాలు చేసినా సరే, సమాజం ఆలోచనా తీరులో, పిల్లల పెంపకంలో మార్పు రాకపోతే లింగ వివక్ష అంతంకాదు. ఆడపిల్లలు ఎందులోనూ తక్కువ కాదని చిన్ననాటి నుంచే మగపిల్లలకు చెబుతూ పెంచాలి. నైతిక విలువలను నేర్పాలి. అంతర్జాలం, ఓటీటీల్లో అశ్లీలతను, స్త్రీలను మరబొమ్మలుగా జమకట్టే పెడపోకడలను సమర్థంగా కట్టడి చేయాలి. ఓట్ల పథకాలతో కాదు- ఇలాంటి బహుముఖ కృషితోనే మహిళల జీవితాలు సురక్షితమవుతాయని నాయకులు గుర్తించాలి.



# సవరించిన ఈపీఎఫ్ పరిమితి ఒక చిన్న అడుగు ఒక పెద్ద మార్పు

**కార్మికులు, విశ్వకర్మలను గౌరవించే 'విశ్వకర్మ జయంతి' పండుగ సందర్భంలో, ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) వేతన పరిమితిని నెలకు రూ. 15,000 నుండి రూ. 25,000కి పెంచుతూ ప్రభుత్వం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న నిర్ణయాన్ని ప్రకటించింది. పరిమితిని రూ. 10,000 పెంచడం వల్ల అసలు ఏం మారుతుంది? ఈ సవరణ అవసరం ఏమిటి? ఇది కార్మికుడు లేదా యజమానిపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. కాబట్టి, అసలు ప్రాథమిక విషయాల నుండి ప్రారంభిద్దాం.ఈ రూ. 25,000 చట్టబద్ధ వేతన పరిమితి అనేది తప్పనిసరి ఉద్యోగ భవిష్య నిధి (ఈపీఎఫ్), ఉద్యోగుల పింఛను పథకం (ఈపీఎస్), మరియు ఉద్యోగుల డిపాజిట్-లింక్డ్ ఇన్సూరెన్స్ (ఈడీఎల్ఐ) పరిధిలోకి రావడానికి ప్రాతిపదికగా పనిచేస్తుంది. భారతదేశంలోని వేతన ఉద్యోగుల సామాజిక భద్రతా వలయానికి ఈ మూడు పథకాలే కీలక మూలస్తంభాలు. ఇవి ఉద్యోగికి పదవీ విరమణ లేదా అత్యవసర నిధిని అందిస్తాయి. అలాగే పదవీ విరమణ తర్వాత చెల్లింపుల కోసం యజమాని విరాళంతో పింఛను నిధిని సమకూరుస్తాయి. ఒకవేళ ఉద్యోగి అకాల మరణం చెందితే వారి కుటుంబానికి ఆసరాగా నిలిచేందుకు యజమాని విరాళంతో జీవిత బీమా రక్షణను కూడా కల్పిస్తాయి. కాలక్రమేణా వేతనాలు, కనీస వేతనాలు మరియు జీవన వ్యయాలు నిరంతరం పెరుగుతున్నప్పటికీ... 2014 నాటి పాత సంఖ్య ఆధారంగానే సామాజిక రక్షణను పరిమితం చేయడం ఎంతమాత్రం సమంజసం కాదు.**




మునుపటి పరిమితి ప్రకారం, రూ. 15,000 కంటే ఎక్కువ నెలవారీ వేతనంతో చేరే కొత్త ఉద్యోగికి తప్పనిసరి ఈపీఎఫ్ వర్తించేది కాదు; అలాగే ఈపీఎస్ మరియు ఈడీఎల్ఐ రక్షణకు అనర్హులుగా ఉండేవారు. కాలక్రమేణా వేతనం పరిమితి కంటే పెరిగిన పాత ఉద్యోగులకు రక్షణ ఆగిపోనప్పటికీ, ఈపీఎస్ కింద పింఛను పరిగణించే వేతనం మాత్రం రూ. 15,000 వద్దే పరిమితమైపోయేది. ఎక్కువ వేతనం పొందే ఉద్యోగులు స్వచ్ఛందంగా ఈ రక్షణను ఎంచుకోవచ్చని ఎవరైనా వాదించవచ్చు. కానీ, పరిమితికి మించిన స్వచ్ఛంద నమోదుకు ఉమ్మడి ఒప్పందం (జాయింట్ ఆప్షన్) కింద యజమాని అంగీకారం తప్పనిసరి. ఇది ఉద్యోగి హక్కుగా కాకుండా యజమానితో జరిపే చర్చలపై ఆధారపడి ఉండేది. ఇప్పుడు పరిమితిని పెంచడం వల్ల, ఈ రక్షణ చర్చల అంశంగా కాకుండా ఉద్యోగి ప్రాథమిక హక్కుగా మారుతుంది. పెంచిన ఈ పరిమితి కార్మికుల సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించకపోవచ్చు, కానీ ఇది సాంప్రదాయ/అధికారిక రక్షణ వలయాన్ని మరింత న్యాయబద్ధంగా, విస్తృతంగా మారుస్తుంది. రూ. 10,000 పెంపు అనేది చిన్నదిగా అనిపించినప్పటికీ, దీని ద్వారా నూతనంగా సామాజిక భద్రత పరిధిలోకి వచ్చిన 51 లక్షల మంది అదనపు కార్మికుల సంఖ్య చిన్నదేమీ కాదు. పైగా, ఇతర ప్రయోజనాల లాగా కాకుండా, ఈ ప్రయోజనాన్ని పొందడానికి కార్మికుడు అదనంగా ఏమీ చేయాల్సిన అవసరం లేదు.

మనుషులకు భవిష్యత్తును ఊహించుకోవడం, దానికి సిద్ధపడటం విషయంలో కొంత నిర్లక్ష్యం ఉంటుంది. తమ అరవై ఐదేళ్ల వయస్సు కోసం ఎవరూ ముందస్తుగా బడ్జెట్ కేటాయించుకోరు. భవిష్యత్తులో వచ్చే పెద్ద ప్రయోజనం కంటే తక్షణమే దక్కే చిన్న ప్రయోజనానికే ప్రాధాన్యమిస్తుంటారు, దీనిని ప్రవర్తనా అర్థశాస్త్రం (బిహేవియరల్ ఎకనామిక్స్) భాషలో 'హైపర్‌బోలిక్ డిస్కౌంటింగ్' అంటారు. ఫలితంగా, పరిమిత ఆదాయంతో భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడం కంటే ప్రస్తుత వినియోగ అవసరాలను తీర్చుకోవడానికే ప్రాధాన్యత ఇస్తుంటారు. అందుకే ఈపీఎఫ్ఓ నిర్వహించే తప్పనిసరి సామాజిక రక్షణ విరాళాల రూపకల్పన ఎంతో కీలకమైనది. ఇది కార్మికుని పొదుపు చేయాలనే సంకల్పం లేదా ఇచ్ఛాశక్తిపై మాత్రమే ఆధారపడి పనిచేయదు. జీతం కార్మికుని ఖాతాలో పడకముందే పింఛను విరాళం వేరుచేయబడుతుంది — కంటికి కనిపించని డబ్బును ఎవరూ ఖర్చు చేయలేరు కదా. ప్రతి నెలా వేతనంలో కొంత భాగం పక్కన చేరి, పదవీ విరమణ సమయానికి ఒక నిధిగా మారడమే కాకుండా, అత్యవసర సమయాల్లో వాడుకోవడానికి, ఉచిత జీవిత బీమా రక్షణ పొందడానికి సహాయపడుతుంది — ఇదంతా మీరు అదనంగా ఏమీ చేయకుండానే జరుగుతుంది.

అయితే, ఈ సవరణ వల్ల యజమానులకు కొంత అదనపు ఖర్చు పెరుగుతుంది. తప్పనిసరి పరిమితి ఇప్పుడు రూ. 25,000కి పెరిగినందున, కంపెనీలు పెద్ద సంఖ్యలో ఉన్న ఉద్యోగులకు చట్టబద్ధమైన ఈపీఎఫ్ రక్షణను విస్తరించాలి మరియు వారి నెలవారీ విరాళాల భాగస్వామ్యం కూడా పెరుగుతుంది. ఉదాహరణకు, గతంలో ఈ చట్టబద్ధ రక్షణ పరిధిలో లేని ఒక ఉద్యోగి నెలకు రూ. 22,000 సంపాదిస్తున్నారనుకుందాం; ఇప్పుడు యజమాని ఆ ఉద్యోగికి చట్టబద్ధంగా ఈపీఎఫ్ రక్షణ కల్పించాలి. యజమాని ఇప్పుడు ఉద్యోగి వేతనంలో 12% విరాళంగా ఇవ్వాలి (ఇది ఈపీఎస్ పింఛను పథకం మరియు ఉద్యోగి స్వంత ఈపీఎఫ్ ఖాతా మధ్య విభజించబడుతుంది), అంటే ఒక ఉద్యోగికి నెలకు రూ. 2,640 లేదా సంవత్సరానికి రూ. 31,680 ఖర్చవుతుంది. ఇలాంటి 20 మంది ఉద్యోగులు ఉన్న కంపెనీకి, సంవత్సరానికి రూ. 6,33,600 అదనపు వేతన ఖర్చు (పేరోల్ కాస్ట్) పెరుగుతుంది. దీనికి ఈడీఎల్ఐ బీమా విరాళం కూడా తోడవుతుంది, ఇది చిన్నమొత్తమే అయినప్పటికీ, ఇప్పుడు ఎక్కువ వేతన ప్రాతిపదికన లెక్కిస్తారు. కొత్త ఉద్యోగులను నియమించుకునేటప్పుడు యజమానులకు ఇది నిజంగానే ఒక అదనపు వ్యయం.

కంపెనీకి వ్యయం పెరగడం అనేది ప్రాథమికంగా కనిపించే ఫలితం మాత్రమే, కానీ ఉద్యోగ మార్కెట్ అంతకంటే చాలా విస్తృతమైనది. మెరుగైన ఈపీఎఫ్ సౌకర్యం అనేది మంచి నైపుణ్యం, అధిక ఉత్పాదకత కలిగిన కార్మికులను ఆకర్షించే ఒక సానుకూల సంకేతంగా పనిచేస్తుంది. ఎందుకంటే కొత్తగా ఉద్యోగంలో చేరేవారు కేవలం నెలవారీ జీతాన్ని మాత్రమే కాకుండా ఇతర ప్రయోజనాలను కూడా చూస్తారు. ఈ రక్షణ వల్ల ఉద్యోగులు సంస్థలోనే సుదీర్ఘకాలం కొనసాగే అవకాశం (రిటెన్షన్) కూడా ఉంటుంది. పింఛను, బీమా సౌకర్యం ఉన్న కార్మికుడు ఎక్కువ కాలం ఉద్యోగంలో కొనసాగడానికి, మరింత భద్రతా భావంతో పని చేయడానికి మొగ్గు చూపుతారు. భవిష్యత్ దృష్టి ఉన్న యజమానులు ఇప్పటికే ఈ విషయాన్ని గ్రహించి, సరైన ప్రతిభను ఆకర్షించడానికి స్వచ్ఛందంగానే ఈ సౌకర్యాన్ని అందిస్తున్నారు.

సామాజిక భద్రత ఆలోచన అనేది ఒక 'ట్రాంపోలిన్' లాంటిది; ఇది మిమ్మల్ని కిందపడకుండా పట్టుకోవడమే కాకుండా, తిరిగి పైకి లేచేలా చేస్తుంది. అత్యవసర పరిస్థితుల్లో లేదా పదవీ విరమణ సమయంలో కార్మికులకు ఆర్థిక నిధిని అందించడమే ఈ వ్యవస్థ యొక్క ముఖ్య ఉద్దేశం, దీనివల్ల తాత్కాలిక సంక్షోభం అనేది జీవితకాల కష్టంగా మారకుండా, అప్పుల ఊబిలో చిక్కుకోకుండా కాపాడుతుంది.

దీనికి అదనంగా ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన వంటి పథకాలు వైద్య సంరక్షణను పేదలకు మరింత అందుబాటులోకి తెచ్చాయి. మారుతున్న ఉద్యోగ స్వభావానికి అనుగుణంగా కార్మికులను సిద్ధం చేయడానికి, పరిశ్రమలతో బలమైన అనుసంధానంతో నైపుణ్యాలను పెంచే (అప్‌స్కిల్లింగ్, రీస్కిల్లింగ్, న్యూ స్కిల్లింగ్) వ్యవస్థ నిర్మాణం జరుగుతోంది. అటల్ పింఛను పథకం (ఏపీవై) ద్వారా పెట్టుబడి ప్రమాదాన్ని ఎదుర్కొంటూ, ఆర్థిక వ్యవస్థ మరియు మార్కెట్ వృద్ధి ప్రయోజనాలను పంచుకోవడానికి సిద్ధంగా ఉన్న తక్కువ ఆదాయ వర్గాలకు కూడా పింఛను రక్షణ విస్తరిస్తోంది. ఈ విధంగా సామాజిక భద్రత అనే ట్రాంపోలిన్ ప్రతి ఒక్క స్ప్రింగ్ జోడిస్తూ మరింత బలపడుతోంది.

**రచయితలు: వి.అనంత నాగేశ్వరన్, భారత ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు, శ్రుతి సింగ్, ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ అధికారి (వ్యాసంలో వ్యక్తపరిచిన అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి)**

# ఎన్నికల సంఘంపైనే ప్రశ్నలు తలెత్తితే?





డా. ముచ్చుకోట సురేష్‌బాబు,
9989988912

**14 అంతర్గత అభ్యంతరాలు లేవనెత్తిన ప్రశ్నలకు రాజకీయ వాదనలతో కాదు.. పారదర్శక సమాధానాలతోనే పరిష్కారం. భారత ఎన్నికల సంఘం మరోసారి విశ్వసనీయతకు సంబంధించిన ప్రశ్నల మధ్య నిలిచింది. అయితే ఈసారి వివాదం కేవలం రాజకీయ పార్టీలు చేస్తున్న ఆరోపణలకు పరిమితం కాలేదు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత పది నెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితాల నుంచి పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా, కమిషన్ పనితీరుకు సంబంధించిన నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.ఇది ఏ రాజ్యాంగ సంస్థకైనా తీవ్రమైన పరిణామమే. ముఖ్యంగా దేశంలో స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను నిర్వహించే బాధ్యత కలిగిన సంస్థ విషయంలో దీనిని తేలికగా తీసుకోలేం. ఎన్నికల సంఘం మాత్రం తన పనితీరును సమర్థించుకుంది. నిర్ణయ ప్రక్రియలో భిన్నాభిప్రాయాలు, లిఖితపూర్వక అభిప్రాయాలు, అంతర్గత పరిశీలనలు సహజమేనని, చివరకు నిర్ణయాలు నిర్దేశిత విధానాల ప్రకారమే తీసుకున్నామని తెలిపింది.అయితే ప్రశ్న అక్కడితో ముగియదు.**

అసలు ప్రశ్న పారదర్శకత

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ నేపథ్యంలోనే ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.ఓటర్ల జాబితాల్లో మరణించినవారు, వేరే ప్రాంతాలకు తరలిపోయినవారు, అనర్హులు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన వారి పేర్లను తొలగించి జాబితాలను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉండటాన్ని ఎవరూ తిరస్కరించలేరు.కానీ అసలు ప్రశ్న ఆ ప్రక్షాళన ఎలా జరుగుతోంది? అన్నదే.సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో 13 కోట్లకు పైగా పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదించింది.ఈ తొలగింపుల్లో చాలా వరకు నిబంధనల ప్రకారం జరిగి ఉండవచ్చు. కానీ ఇంత భారీ స్థాయిలో పేర్లు తొలగించబడుతున్నప్పుడు, ప్రతి అర్హుడైన ఓటరుకు ధృవీకరణ, అభ్యంతరం వ్యక్తం చేసే అవకాశం, అప్పీల్ చేసుకునే సులభమైన విధానం ఉండటం అత్యవసరం.ఓటర్ల జాబితా నుంచి ఒకరి పేరు తొలగిపోవడం కేవలం డేటాబేస్‌లోని ఒక ఎంట్రీ మాయం కావడం కాదు. అది ఆ పౌరుడి ఓటు హక్కును ఆచరణలో వినియోగించుకునే అవకాశాన్ని ప్రభావితం చేసే అంశం.

డిజిటల్ ఓటర్ల జాబితాపై నియంత్రణ ఎవరిది?

అంతర్గతంగా లేవనెత్తిన అంశాల్లో అత్యంత కీలకమైనది ఓటర్ల డేటా కేంద్రీకరణ.ఎన్నికల జాబితాల నిర్వహణలో రాష్ట్ర, నియోజకవర్గ స్థాయి చట్టబద్ధ అధికారులకు తగినంత ప్రాప్యత, నియంత్రణ కొనసాగుతోందా? లేక సాంకేతిక వ్యవస్థల ద్వారా నిర్ణయాధికారం క్రమంగా కేంద్రస్థాయికి కేంద్రీకృతమవుతోందా? అనే ప్రశ్నలు లేవనెత్తబడ్డాయి.ఇది ప్రజలకు స్పష్టంగా వివరించాల్సిన అంశం.సాంకేతికత ఎన్నికల నిర్వహణను మెరుగుపరచాలి. కానీ చట్టబద్ధ బాధ్యతను సాంకేతిక వ్యవస్థ భర్తీ చేయకూడదు.ఓటర్ల జాబితాలో ప్రతి పేరు చేర్పు, తొలగింపు లేదా మార్పుకు స్పష్టమైన డిజిటల్ ఆధారం ఉండాలి. ఎవరు మార్పు చేశారు? ఏ చట్టపరమైన అధికారంతో చేశారు? ఏ ఆధారంతో చేశారు? అనే ప్రశ్నలకు ఆడిట్ ద్వారా సమాధానం దొరికేలా వ్యవస్థ ఉండాలి.గోవాలో 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించినప్పటికీ, సాఫ్ట్‌వేర్ పరిమితుల కారణంగా ఆ నిర్ణయాలను నమోదు చేయడంలో సమస్యలు ఎదురయ్యాయని వచ్చిన నివేదికలు కూడా డిజిటల్ వ్యవస్థలపై పారదర్శకత, బాధ్యత ఎంత అవసరమో చూపిస్తున్నాయి.

అంతర్గత భిన్నాభిప్రాయం సమస్య కాదు

రాజ్యాంగ సంస్థలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడం తప్పనిసరిగా బలహీనతకు సంకేతం కాదు. నిజానికి, అంతర్గత పరిశీలన, ప్రశ్నించడం, అభ్యంతరాలను నమోదు చేయడం ఒక సంస్థలోని నియంత్రణ వ్యవస్థలు పనిచేస్తున్నాయనే సంకేతం కూడా కావచ్చు. అసలు ఆందోళన ఏమిటంటే—ఆ అభ్యంతరాలను ఎలా పరిగణించారు? వాటిపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నారు? ప్రజలకు దాని గురించి ఎంతవరకు సమాచారం అందుతోంది?కొత్త ఓటర్ల నమోదు కోసం ఉపయోగించే ఫారం-6 విధానంలో మార్పులు, పశ్చిమ బెంగాల్‌లో అప్పీళ్ల ప్రక్రియ వంటి అంశాలపై కూడా ప్రశ్నలు తలెత్తాయి.ఇలాంటి విషయాల్లో రాజకీయ ఆరోపణలు కాకుండా స్పష్టమైన నియమాలు, ఆధారాలు, పత్రాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి.

రాజకీయ ఆరోపణలకు ఆధారాలు అవసరం

ఎన్నికల జాబితాలను అధికార పార్టీకి అనుకూలంగా మార్చుతున్నారని ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. బీజేపీ, ఎన్నికల సంఘం ఆ ఆరోపణలను ఖండిస్తున్నాయి.ఇలాంటి తీవ్రమైన ఆరోపణలను కేవలం రాజకీయ ప్రకటనల ఆధారంగా నిజాలుగా పరిగణించలేం. వాటికి ఆధారాలు అవసరం.అదే సమయంలో, ఎన్నికల నిర్వహణపై లేవనెత్తుతున్న ప్రతి ప్రశ్నను రాజకీయ ఆరోపణగా కొట్టిపారేయడం కూడా సరైంది కాదు.ఎవరు ప్రశ్న అడిగారు అన్నదానికంటే, ఆ ప్రశ్నకు సమాధానం ఏమిటి? అన్నదే ప్రజాస్వామ్యంలో ముఖ్యం.

ప్రజా విశ్వాసమే అసలైన ఎన్నికల మౌలిక వసతి

ఎన్నికల సంఘం విశ్వసనీయత కేవలం ఎన్నికలను సకాలంలో నిర్వహించడంలో లేదు. ప్రజలు ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, చట్టబద్ధంగా విశ్వసించడంలో ఉంది.అందుకే ప్రస్తుత వివాదాన్ని మరో రాజకీయ ఘర్షణగా చూడకుండా, సంస్థాగత పారదర్శకతను పెంచుకునే అవకాశంగా ఎన్నికల సంఘం చూడాలి.అంతర్గతంగా లేవనెత్తిన అభ్యంతరాలపై సాధ్యమైనంతవరకు పత్రాలు, విధానాలు, నిర్ణయాల వివరాలను ప్రజలకు వెల్లడించాలి. ఓటర్ల డేటాబేస్ భద్రత, పేర్ల తొలగింపు, కొత్త నమోదు, అప్పీళ్ల ప్రక్రియలపై స్పష్టమైన జవాబులు ఇవ్వాలి.ఎందుకంటే భారత ప్రజాస్వామ్యం "మమ్మల్ని నమ్మండి" అనే మాటపై మాత్రమే ఆధారపడకూడదు. అది పారదర్శకమైన విధానాలు, చట్టబద్ధమైన నిర్ణయాలు, స్వతంత్ర పరిశీలన, ప్రజలకు జవాబుదారీతనం మీద నిలవాలి. చివరికి ప్రశ్న ఒక్కటే:అర్హత కలిగిన ప్రతి భారతీయుడి పేరు ఓటర్ల జాబితాలో ఉందని, తన ఓటు హక్కును ఎవరూ ఏకపక్షంగా తొలగించలేరని, తన ఓటుకు సంబంధించిన ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతోందని ఒక సాధారణ పౌరుడు నమ్మగలడా?ఆ నమ్మకాన్ని ఎన్నికల సంఘం మాటలతో కాదు—వ్యవస్థతో, ఆధారాలతో, పారదర్శకతతో నిరూపించాలి.ఎన్నికలు ఎవరు పాలించాలో నిర్ణయిస్తాయి.కానీ ఎన్నికల ప్రక్రియపై ప్రజల విశ్వాసమే ప్రజాస్వామ్యం ఎంత బలంగా ఉందో నిర్ణయిస్తుంది.

# ప్రవాహాలతో రిజర్వాయర్లు, చెరువులు నింపాలి

అమరావతి, సెప్టెంబర్ 24, అనంతజనశక్తి న్యూస్

వర్షాల కారణంగా వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని నీటి వనరుల్ని నింపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా, గోదావరి డెల్టాలోని రిజర్వాయర్లతో పాటు పరిధిలో ఉన్న వివిధ నీటి వనరుల్ని కూడా నింపాలని స్పష్టం చేశారు. రియల్‌టైమ్ గవర్నెన్స్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏఐ ఆధారిత సాంకేతికత వినియోగం, డేటా అనలిటిక్స్, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే వ్యూహాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వర్ష ప్రభావంపై సీఎం చర్చించారు.

తీవ్ర వాయుగుండం కారణంగా రాష్ట్రంలో గడచిన మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా భూగర్భజలాలు కొంత మేర పెరిగాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకాశం బ్యారేజి సహా మున్నేరు సహా ఇతర క్యాచ్ మెంట్ ఏరియా నుంచి 11 వేల క్యూసెక్కుల నీరు వస్తోందని అన్నారు. ప్రాజెక్టుల దిగువన ఉన్న అన్ని నీటి వనరుల్లో వర్షపు నీటిని నిల్వ చేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. అవసరమైన చోట మోటార్లను వాడి నీటిని లిఫ్ట్ చేయాలని స్పష్టం చేశారు. గోదావరి నుంచి వస్తున్న ప్రవాహాల ద్వారా 24 టీఎంసీల నీటిని ఏలేరు రిజర్వాయర్ నింపాలని స్పష్టం చేశారు.

పోలవరం ఎడమ కాలువ ద్వారా అనకాపల్లి వరకూ నీటి వనరుల్లోకి నీటిని పంపాలన్నారు చంద్రబాబు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో వర్షాలు అధికంగా నమోదు అయ్యాయని అధికారులు వివరించారు. ముఖ్యంగా విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం, కాకినాడ, ఉభయగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్ సహా వివిధ జిల్లాల్లో తీవ్ర వర్ష ప్రభావం కనిపించిందని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న వర్షాలు, గాలుల తీవ్రత, నదులువాగుల్లో పెరుగుతున్న ప్రవాహాలు, రిజర్వాయర్లలోకి చేరుతున్న వరద నీరు, రాబోయే రోజుల్లో అంచనా వేసిన వర్షపాతంపై ముఖ్యమంత్రి సమీక్షించారు.

తాజా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టేలా అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల ప్రభావంతో గోదావరి బేసిన్‌లోని శబరి, ఇంద్రావతి, ఏలేరు, తాండవ, ఎర్రకాల్వ, పంపా, మేఘాద్రిగడ్డ తదితర రిజర్వాయర్లకు భారీగా వరద నీరు చేరుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

ఏలేరు రిజర్వాయర్‌కు 21,200-26,500 క్యూసెక్కుల మేర, తాండవకు 6,000-7,500 క్యూసెక్కులు, మేఘాద్రిగడ్డకు 2,4003,000 క్యూసెక్కులు, పంపాకు 3,100-3,875 క్యూసెక్కులు వరకు ఇన్‌ఫ్లో వస్తుందని అంచనా వేస్తున్నారు. ఉత్తర కోస్తా రిజర్వాయర్లకు కూడా రాబోయే రోజుల్లో ఇన్‌ఫ్లో గణనీయంగా పెరుగుతుందని వెల్లడించారు. నాగావళి-వంశధార బేసిన్లలో వర్షాల ప్రభావంతో ప్రవాహాలు పెరగనున్నాయని వివరించారు. గొట్టా బ్యారేజీకి సెప్టెంబర్ 25 ఉదయం నాటికి వార్నింగ్ లెవల్-1 చేరుకునే అవకాశం ఉందని అంచనా వేశారు.

భద్రాచలం వద్ద సెప్టెంబర్ 26 మధ్యాహ్నానికి వార్నింగ్ లెవల్-1, అదే రోజు రాత్రికి వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సెప్టెంబర్ 27 ఉదయం వార్నింగ్ లెవల్-1, సాయంత్రం వార్నింగ్ లెవల్-2 దాటే అవకాశం ఉందని అంచనా వేశారు. శబరి నదిపై కుంటా వద్ద సెప్టెంబర్ 26 ఉదయానికి వార్నింగ్ స్థాయికి చేరుకునే అవకాశం ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఎల్‌నినో వంటి వాతావరణ పరిస్థితులను మార్చడం సాధ్యం కాకపోయినా.. వాటి ప్రభావాన్ని తగ్గించేలా అంతర్గత పరిస్థితులను మార్చుకోవచ్చని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. భూసారాన్ని పెంచడం, సాయిల్ టెస్టింగ్ ఆధారంగా ప్రత్యామ్నాయ పంటలను సూచించడం, బయోచార్, ప్రకృతి వ్యవసాయం వంటి విధానాల ద్వారా ఎల్‌నినో ప్రభావాన్ని కొంతమేర తగ్గించవచ్చని తెలిపారు. ఈ విధానాన్ని రాష్ట్రంలో పైలట్‌గా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి వ్యవసాయ రంగానికి అవసరమైన సూచనలు అందించేలా సాంకేతికతను వినియోగించుకోవాలని సీఎం సూచించారు.

అక్టోబరు 2 తేదీన ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ కు శంకుస్థాపన చేయనున్నామని, అదే రోజు రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా అభివృద్ధి చేసే కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు ముఖ్యమంత్రి. మైక్రోసాఫ్ట్ సహకారంతో రూపొందించిన ఏఐ స్టాక్ ద్వారా కలిగే లాభాలను వివరిస్తూ డెమో ఇవ్వాలని సీఎం సూచించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను మరింతగా మెరుగుపరచాలని సీఎం ఆదేశించారు. విద్యుత్ టారిఫ్‌ను పెంచకపోయినా సేవల్లో లోపాల కారణంగా ప్రజల్లో సంతృప్తి తగ్గుతోందని, సరఫరా నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

# కాకుమాను రాజశేఖర్ ఆకస్మిక మృతి




- వైసీపీలో విషాదం.. జగన్ సంతాపం

హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో తీవ్ర విషాదం నెలకొంది.. వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ లిడ్‌క్యాప్ ఛైర్మన్ కాకుమాను రాజశేఖర్ ఆకస్మిక మరణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రాజశేఖర్ మృతి పార్టీకి, వ్యక్తిగతంగా తనకు తీరని లోటని జగన్ పేర్కొన్నారు. కాగా, కాకుమాను రాజశేఖర్ గురువారం ఉదయం హైదరాబాద్‌లోని తన నివాసంలో గుండెపోటుతో మృతి చెందినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన వైఎస్సార్‌సీపీకి అంకితభావంతో పనిచేశారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించారని జగన్ గుర్తుచేశారు. రాజశేఖర్ ఆకస్మిక మరణం తీవ్రంగా బాధించిందని జగన్ తెలిపారు. పార్టీ కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొంటూ, ఆయన లేని లోటు పార్టీకి ఎప్పటికీ పూడ్చలేనిదని అన్నారు. రాజశేఖర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు వైఎస్ జగన్.. కాగా, గతంలో లిడ్‌క్యాప్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన రాజశేఖర్, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రచార విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఆయన మృతి నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో విషాదం నెలకొంది. రాజశేఖర్ మృతికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఇక, తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్ కు నివాళులు అర్పించారు పార్టీ నేతలు.. కాకుమాను రాజశేఖర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు జూపూడి ప్రభాకర్, టీజేఆర్ సుధాకర్ బాబు, పుత్తా శివ శంకర్, మనోహర్ రెడ్డి, నారాయణ మూర్తి, కొమ్మూరి కనకారావు, సురేంద్ర, ఇతర నేతలు..

# రాష్ట్రానికి పట్టిన చీడపురుగు జగన్ రెడ్డి.. బందరుకి పట్టిన శని గ్రహం పేర్ని నాని

- ఐదేళ్లు అధికారంలో ఉండి మున్సిపాలిటీకి రూపాయి ఖర్చు చేయలేదు
- యుద్ధ ప్రాతిపదికన పూర్తవుతున్న బందరు పోర్టుపైనా కుట్రలు చేస్తున్నాడు
- గంజాయి బ్యాచ్, వీధి రౌడీలతో జగన్ రెడ్డి రాష్ట్రాన్ని నాశనం చేయాలని చూస్తున్నాడు
- జగన్ రెడ్డి లాంటి అరాచక శక్తిని తరిమికొడదామని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపు

మచిలీపట్నం సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్



రాష్ట్రం అభివృద్ధి కంటే.. అరాచకం సృష్టించడమే ముఖ్యం అనేలా జగన్ రెడ్డి వ్యవహరిస్తున్నాడని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ధ్వజమెత్తారు. ఈ మేరకు ఆర్ అండ్ బీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉపాధ్యాయ నియామకాలపై జగన్ రెడ్డి అండ్ కో ఏకంగా 350కి పైగా కేసులు వేశారు. అయినప్పటికీ కేసులన్నింటినీ పరిష్కరించి.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 16వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశాం. ఏడాదికి పైగా వారు ఉద్యోగాలు చేసుకున్నారు. మొదట మాస్ కాపీయింగ్ జరిగిందని ఆరోపణలు చేశారు. తర్వాత స్పోర్ట్స్ కోటాలో ఏదో జరిగిపోయిందని ఆరోపిస్తున్నారు. కానీ ఆధారాలు చూపమంటే మాత్రం పారిపోతున్నారు.ఇప్పుడు ఏకంగా శాప్ కార్యాలయంలో ఉన్న ఉపాధ్యాయులపై రౌడీషీటర్లు, గంజాయి బ్యాచ్‌తో దాడులకు ప్రయత్నించారు. కృష్ణా జిల్లా అంటే రాజకీయంగా ఎంతో గొప్ప పేరు ఉంది. కానీ కృష్ణా జిల్లాలోని వైసీపీ నాయకులకు కనీస ఇంగితం కూడా లేకుండాపోయింది. రాజకీయాలు కృష్ణా జిల్లాకు కొత్తేమీ కాదు. కానీ.. వైసీపీ లాంటి నీచ రాజకీయాలు ఎవరూ చేయలేదు. బందరు అభివృద్ధిని అడ్డుకున్న వ్యక్తి దుర్మార్గుడు పేర్ని నాని. బందరు చరిత్రను నాశనం చేశాడు. ఐదేళ్లు మంత్రిగా ఉండి డ్రైనేజీలకు రూపాయి కూడా ఖర్చు చేయలేదు. గతంలో బందరు పోర్టు కోసం ఉద్యమాలు చేస్తున్న మిమ్మల్ని ఫ్యాబ్రికేటెడ్ ఉద్యమాలు అంటూ అవమానించాడు. ఉద్యమాలు చేసి ప్రభుత్వాలనే తలవంచేలా చేసి పోర్టు సాధించుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వంలో గాలికి వదిలేశారు. పోర్టు పూర్తి చేయకుంటే ముక్కు నేలకు రాస్తానన్న పేర్ని నాని తర్వాత సిగ్గు లేకుండా తిరుగుతున్నాడు.సాధారణ వ్యక్తులు కూడా పేర్ని నాని అరాచకాలను నిలదీస్తున్నారు. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్నాడు. బ్యాంకుల్ని ముంచేసి, ఎవరైనా ప్రశ్నిస్తే రాద్ధాంతం చేస్తున్నాడు. వైసీపీ ఐదేళ్ల పాలనలో బందరు పోర్టును గాలికి వదిలేశారు. ఎన్నికల ముందు డ్రామాలాడాడు. ప్రజలిచ్చిన తీర్పుతో మేము పోర్టు పనులు వేగవంతంగా పూర్తి చేస్తున్నాం. పరిశ్రమలు తీసుకొస్తున్నాం. అలాంటి అభివృద్ధిపై కూడా ఏదో జరిగిపోతోందంటూ రాద్ధాంతం చేస్తున్నాడు. ఇలాంటి వ్యక్తుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజల్లో అలజడులు సృష్టించాలని ప్రయత్నిస్తే ఉపేక్షించేది లేదు. రైతులకు ఎలాంటి నష్టం లేకుండా.. భూములు సేకరిస్తాం. గతంలోనే ఎకరాకు రూ.25 లక్షల రూ.200 కోట్లు చెల్లించాం. గత రెండు సంవత్సరాల్లో మచిలీపట్నం మున్సిపాలిటీలో రూ.300 కోట్ల నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేస్తున్నాం. రోడ్లు, తాగునీటి ప్రాజెక్టులు, డ్రైనేజీలు, పార్కులు, శ్మశానవాటికలు అన్నింటినీ ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తున్నాం. విజన్ డాక్యుమెంట్ తయారుచేసి.. రాబోయే 25 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకుని అడుగులు వేస్తున్నాం. రోడ్లెక్కి బూతులు మాట్లాడడం, కులాలు మతాల మధ్య చిచ్చు పెట్టేలా వ్యవహరించడం తప్ప జగన్ రెడ్డికి ఏదీ సాధ్యం కాదు. అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం సిగ్గుచేటు. రాష్ట్రంలో జగన్ రెడ్డి, బందరులో పేర్ని నాని అరాచకాలకు పాల్పడుతున్నాడు. గంజాయి బ్యాచ్‌తో అరాచకాలు చేస్తున్నారు. దాడులు చేయిస్తున్నాడు.

ఇలాంటి వ్యక్తులను ప్రజలు తరిమి కొట్టాలి. మన బందరు అభివృద్ధిలో అందరం భాగస్వాములవుదాం. అబివృద్ధి ఫలాలను అందరం అనుభవిద్దాం. పేర్ని నాని లాంటి దుర్మార్గుల వ్యాఖ్యలు నమ్మి కూర్చొన్న కొమ్మను నరుక్కునే ప్రయత్నం చేయొద్దు. బందరుకి పరిశ్రమలు తీసుకొస్తాం. పెట్టుబడులు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఒక్కరి జీవన ప్రమాణాలు పెంచడమే మా లక్ష్యం. మన బందరు చరిత్రని పునరుద్ధరించడమే కూటమి నాయకుల లక్ష్యమని మంత్ర కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# తీరం దాటిన తీవ్ర వాయుగుండం

- ఇంకా పొంచివున్న ముప్పు
- భారీ వర్షా లతో రాష్ట్రం అతలాకుతలం
- చేపట వేటకు వెళ్లొద్దు: వాతావరణ శాఖ
- విజయనగరంలో భారీ వర్షా లు

హైదరాబాద్, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం బలపడడంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో.. నిన్న రాత్రి కళింగపట్నానికి సమీపంలో తీవ్ర వాయుగుండం తీరం దాటింది. అయినప్పటికీ ప్రమాదం ఇంకా పొంచి ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ప్రస్తుతం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాల మధ్య తీవ్రవాయుగుండం కేంద్రీకృతం అయిందని వాతావరణ నిపుణులు తెలియజేశారు. అయితే.. ఈ తీవ్ర వాయుగుండం ఉత్తర వాయవ్య దిశగా కదులుతున్న క్రమంలో బలహీనపడుతూ.. వాయుగుండంగా మారే అవకాశం ఉందని వారు తెలిపారు. దీని ప్రభావంతో రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వం పలు జిల్లాలకు ఎల్లో, ఆరెంజ్ అలెర్ట్స్ జారీ చేసింది.

**చేపట వేటకు వెళ్లొద్దు: వాతావరణ శాఖ**

గురువారం శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. శుక్రవారం అల్లూరి, ఏలూరు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఈ మేరకు రానున్న మూడు రోజులపాటు.. మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లరాదని హెచ్చరించింది. ఏపీలోని అన్నీ ప్రధాన పోర్ట్సల్లో 3వ నంబర్ ప్రమాద హెచ్చరికలు కొనసాగుతున్నాయి. గడిచిన 24 గంటల్లోనే విశాఖలోని వాల్తేర్‌లో 28 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు.

భారీ వర్షాలకు విజయనగరం జిల్లా రాజాం పట్టణంలో రహదారులు జలమయం అయ్యాయి. రాజాంచీపురుపల్లి ప్రధాన రహదారిపై, గాయత్రీ కాలనీ వద్ద వరద నీరు ప్రవహిస్తోంది. గోపినాయుడు చెరువు పొంగడంతో వీధుల్లోకి వరద చేరింది. దీంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సంతకవిటి మండలంలోని సిరిపురం, మండవ కురీటి గ్రామాల వద్ద రెల్లిగడ్డ పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జోరు వానలకు బొబ్బిలిలోని పలు రహదారులు జలమయమయ్యాయి. ఇందిరమ్మ కాలనీ నీట మునిగింది. రంగారాయపురం ఆనకట్ట వద్ద నాగావళి నది ఉద్ధృతంగా ప్రవహిస్తోంది.

అల్లూరి జిల్లాలో వరద బీభత్సం

అల్లూరి సీతారామరాజు జిల్లాలో వరద బీభత్సం సృష్టిస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొయ్యూరు మండలంలో జాతీయ రహదారిపై కొండ చరియలు విరిగిపడ్డాయి. పాడేరు జి.మాడుగుల మధ్య డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జీకే వీధి మండలంలో ఇటీవల నిర్మించిన జర్రెల కొత్తూరు కల్వర్టు కొట్టుకుపోయింది. చింతపల్లి మండలం చౌడుపల్లి పశువులబందా చెరువుకు గండి పడింది. దీంతో ఏజెన్సీ ప్రాంతం లో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది.

# లోతట్టు ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించండి



(మొదటి పేజీ తరువాయి)

వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు లోతట్టు ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, వరద ముంపు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అవసరం అయితే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని సూచనలు చేశారు. భారీ వర్షాల నేపథ్యంలో కాకినాడ జిల్లాలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్ ద్వారా సమీక్షించారు. రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా వర్షాలు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, జలాశయాల్లో నీటి మట్టాలు, విద్యుత్ సరఫరా, తాగునీటి వ్యవస్థ, పంట నష్టం, మత్స్యకారుల భద్రత తదితర అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన రెండు రోజుల్లో జిల్లా వ్యాప్తంగా సగటున 117.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని, 15 ప్రాంతాల్లో రోడ్లపై చెట్లు కూలగా అగ్నిమాపక సిబ్బంది సహకారంతో తక్షణం తొలగించామని, ప్రాథమిక అంచనాల మేరకు జిల్లావ్యాప్తంగా 1,885 హెక్టార్లలో పంట దెబ్బతిందని కాకినాడ కలెక్టర్ హరేందర్ ప్రసాద్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి వివరించారు. ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి శాఖల వారీగా పరిస్థితిని 24 గంటలు సమీక్షిస్తున్నట్టు, ప్రస్తుతం పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ వరద ముంపు, సహాయక చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇంకా భారీ వర్షాలు కురుస్తుండడంతోపాటు ఆకస్మిక వరద ముప్పు పొంచి ఉన్న హెచ్చరికలు ఉండడం వల్ల లోతట్టు ప్రాంతాలు, ముంపు పొంచి ఉన్న గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని, అవసరం ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రివర్యులు స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణకు అంతరాయం లేకుండా లోతట్టు ప్రాంతాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ లేకుండా పంపుల వినియోగించి ఎప్పటికప్పుడు డీవాటరింగ్ చేయాలని, ఈదురు గాలుల కారణంగా రహదారులపై కూలిన చెట్లను తక్షణం తొలగించి రాకపోకలకు ఆటంకాలు కలగకుండా చర్యలు తీసుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలని తెలిపారు. విద్యుత్ సరఫరా, తాగునీరు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా పరిధిలోనే ఏలేరు, తాండవ, పంపా, సుబ్బారెడ్డి సాగర్ జలాశయాల్లో నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైనప్పుడు దిగువ ప్రాంతాల ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని చెప్పారు. వర్షాలు తగ్గిన వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టి పంట నష్టాన్ని అంచనా వేయాలని, ప్రభుత్వానికి నివేదిక పంపి, రైతులకి తక్షణం సహాయం అందేలా చూడాలని సూచించారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్న నేపథ్యంలో ఉప్పాడ తీర ప్రాంతంలో పరిస్థితిని ఉప ముఖ్యమంత్రివర్యులు అడిగి తెలుసుకున్నారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లకుండా హెచ్చరికలు అమలు చేయాలన్నారు. పిఠాపురం నియోజకవర్గం పరిధిలో సుద్దగడ్డ వాగు ముంపు ప్రాంతాల్లో పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదిక పంపాలని ఉప ముఖ్యమంత్రివర్యులు కోరారు. పరిస్థితి సాధారణ స్థితికి వచ్చే వరకు జిల్లా యంత్రాంగం ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

# నిమజ్జనం విధుల్లోని ఎస్ఐ వెంకన్న మృతి

## సంతాపం తెలిపిన సీఎం రేవంత్

హైదరాబాద్ సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

హైదరాబాద్ గణేష్ నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూటౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె. వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని వ్యాఖ్యానించారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా యావత్ పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న గారి కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి గారు హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు.



# పెట్టుబడులు పెట్టండి



(మొదటి పేజీ తరువాయి)

నక్కపల్లిలో రాబోయే బల్క్ డ్రగ్ పార్క్‌లో జెనరిక్ మందుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఈ పార్క్‌లో అనుకూలమైన భూమి, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, వినియోగ సేవలు, ఇతర రాష్ట్రాలకు మించిన విధానపరమైన మద్దతు ఉంటాయని తెలిపారు. విశాఖపట్నంలో అబాట్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అబాట్ ఎండీ అంజాద్ మాట్లాడుతూ.. తమ సంస్థ భారత్‌లో 400కు పైగా ఫార్మా బ్రాండ్లు, 12వేలకు పైగా ఉద్యోగులను కలిగి ఉందని తెలిపారు. ప్రస్తుతం గోవా, బద్ది (హిమాచల్ ప్రదేశ్), ఝగాడియా (గుజరాత్)లలో తయారీ కేంద్రాలు, ముంబయి, న్యూఢిల్లీలో కార్యాలయాలు ఉన్నట్లు చెప్పారు. పోషకాహారం , ఫార్మా ఉత్పత్తుల కోసం స్థానిక పేరెన్నికగన్న తయారీసంస్థల్లో పెట్టుబడులకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలను పరిశీలిస్తామని అంజాద్ చెప్పారు.

**సిస్కో ఇండియా ఎండీ హరీష్ కృష్ణన్‌తో మంత్రి లోకేశ్ భేటీ**

గ్లోబల్ నెట్‌వర్కింగ్, సెక్యూరిటీ, కొలాబరేషన్, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో పేరెన్నికగన్న సిస్కో సిస్టమ్స్ (యుఎస్ఏ) మేనేజింగ్ డైరెక్టర్ (ఇండియా & సౌత్ ఈస్ట్ ఆసియా) హరీష్ కృష్ణన్‌తో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. డేటా సెంటర్ ఎకోసిస్టమ్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఉత్పత్తి వల్ల కలిగే ప్రయోజనాలను (ఎకానమీస్ ఆఫ్ స్కేల్) సాధించడానికి, డేటా సెంటర్ వాల్యూ చైన్ మొత్తం వ్యవస్థను రాష్ట్రంలోకి ఆకర్షించాలని ప్రభుత్వం యోచిస్తోందని చెప్పారు. డేటాసెంటర్ల డిమాండ్‌కు అనుగుణంగా ఏపీలో యూనిఫైడ్ కంప్యూటింగ్ సిస్టమ్ సర్వర్లు, స్విచ్‌లు, రౌటర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నంలో ఒక ఇంజనీరింగ్ సెంటర్/జీసీసీని ఏర్పాటు చేయాలని కోరారు. సిస్కో ఇండియా ఎండీ హరీష్ కృష్ణన్ మాట్లాడుతూ.. ఏపీలో 50వేలమంది యువతను నెట్ అకాడ్ యాక్సెస్, ఐటీ, ఇతర పరిశ్రమల్లో అత్యంత నైపుణ్యం గల శ్రామిక శక్తిగా అభివృద్ధి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వంతో గతేడాది మార్చిలో ఒప్పందం చేసుకున్నామని, ఇప్పటికే అమలులో ఉందని తెలిపారు. విశాఖపట్నంలో ఇన్నోవేషన్ సెంటర్, తిరుపతిలో సీఓఈ, విజయవాడ స్మార్ట్ సిటీ, ఏపీ ఫైబర్‌నెట్ (22,500 కి.మీ.) ప్రాజెక్టుల్లో తాము భాగస్వామ్యం వహించినట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వ తాజా ప్రతిపాదనలను పరిశీలిస్తామని చెప్పారు.

**ఏపీలో కాంపొనెంట్స్ తయారీ పార్కు అభివృద్ధి చేయండి**

**చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ తయారీ సంస్థ వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ (గవర్నమెంట్ ఎఫైర్స్ & స్ట్రాటజిక్ ఎంగేజ్‌మెంట్) తో మంత్రి నారా లోకేశ్ సమావేశమయ్యారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న తిరుపతిలో వివో మొబైల్స్ కాంపోనెంట్స్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసే అవకాశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. వివో సరఫరాదారుల కోసం ఒక కాంపోనెంట్స్ తయారీ పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరారు. వివో, దాని అనుబంధ సంస్థల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి ఒక 'సప్లై చైన్ సమావేశాన్ని' నిర్వహించాలని మంత్రి లోకేశ్ సూచించారు. వివో ఇండియా ప్రెసిడెంట్ అర్జిత్ సేన్ మాట్లాడుతూ... వివో మొబైల్ ఇండియా ప్రతిపటా 154.2 మిలియన్ యూనిట్ల మొబైల్ యూనిట్లను తయారీ చేస్తూ స్మార్ట్ ఫోన్ మార్కెట్‌లో అగ్రగామిగా ఉందని తెలిపారు. దేశంలో విక్రయించే ఫోన్లలో 99శాతానికి పైగా (మదర్‌బోర్డులు, 90% పైగా బ్యాటరీలు, ఛార్జర్‌లతో సహా) గ్రేటర్ నోయిడాలోనే తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనలపై సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామని అర్జిత్ సేన్ తెలిపారు.**

## చిరిగింత పారిజాత నర్సింహారెడ్డిని సన్మానించిన లేమూర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు



**– లేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి**

**– జిల్లా జనరల్ సెక్రటరీ డిల్లి శ్రీధర్ ముదిరాజ్**

**మహేశ్వరం, సెప్టెంబర్ 24, ( అనంత జనశక్తి ):**

రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన చిరిగింత పారిజాత నర్సింహారెడ్డి ని లేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ డిల్లి శ్రీధర్ ముదిరాజ్ మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు.శాలువాతో సత్కరించి, పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, అన్ని నియోజకవర్గాల్లో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.ఈ కార్యక్రమంలో లేమూర్ గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు కొండారెడ్డి, జిల్లా జనరల్ సెక్రటరీ దిల్లి శ్రీధర్ ముదిరాజ్, లేమూర్ గ్రామ శాఖ అధ్యక్షులు మహ్మద్ రహీమ్, సీనియర్ నాయకులు అఖిల్ అహ్మద్, సాయికిరణ్ గౌడ్, ఎస్.సి సెల్ అధ్యక్షులు డప్పు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అనుభవజ్ఞులు, సీనియర్ నాయకులు అయిన పారిజాత నర్సింహారెడ్డి కి జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం చాలా సంతోషంగా ఉందని, ఆయన నాయకత్వంలో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని, కార్యకర్తలకు అండగా నిలుస్తారని ఆకాంక్షించారు.

## రికార్డు స్థాయిలో ముచ్చర్ల వినాయకుడి లడ్డూ వేలం



**- రూ. 5,53,000లకు దక్కించుకున్న సర్పంచ్ ఊటు పద్మ మహేందర్**

**- లడ్డు దక్కించుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన**

**- ముచ్చర్ల గ్రామ సర్పంచ్ ఊటు పద్మ మహేందర్***

**మహేశ్వరం, సెప్టెంబర్ 24 ( అనంత జనశక్తి ):**

మహేశ్వరం మండలం ముచ్చర్ల గ్రామంలో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ముచ్చర్ల గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన లడ్డూ వేలం పోటాపోటీగా సాగి రికార్డు సృష్టించింది.గణనాథుని లడ్డూ ప్రసాదాన్ని ఏకంగా రూ. 5,53,000 (అక్షరాల ఐదు లక్షల యాభై మూడు వేల రూపాయలు) వేలం పాడి ముచ్చర్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఊటు పద్మ మహేందర్ గారు కైవసం చేసుకున్నారు. ఈ లడ్డూను దక్కించుకోవడం వెనుక ఆ భగవంతుని ఆశీర్వాదం ఉందని, లడ్డూ ప్రసాదం దక్కడం ఎంతో సంతోషంగా, అదృష్టంగా భావిస్తున్నానని సర్పంచ్ తెలిపారు.9 రోజుల పాటు చండీ ఉపాసకులు శ్రీ రేవెల్లి రాజు శర్మ అయ్యగారి ఆధ్వర్యంలో నిత్య పూజలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా లడ్డూ గ్రహీత సర్పంచ్ ఊటు పద్మ మహేందర్ గారికి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.రికార్డు స్థాయిలో లడ్డూ ప్రసాదం వేలం పాడడం గ్రామానికే గర్వకారణమని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ చైర్మన్ సిద్ధాల రమణ, మాజీ సర్పంచ్ ఇంజమూరి రామచంద్రారెడ్డి, బక్క అంజయ్య, చేగురి బీరప్ప, తల్లోజు నందీశ్వర్, ఎంపీటీసీ బక్క మల్లేష్, రేపని రవి, బండ వెంకటేష్, కుమ్మరి వెంకటేష్, శంకరి వెంకటేష్, బండ నర్సింహ, చేగురి మల్లేష్, బక్క వెంకటేష్, మున్నూరు సంజీవులు, శ్రీశైలం, శివ, పృథ్వీ, భజన మండలి సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డిగ్రీ స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



**- చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

**- మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంగి రమేశ్**

**మహేశ్వరం, సెప్టెంబర్ 24 ( అనంత జనశక్తి ):**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. దోస్త్ ద్వారా సీట్లు పొందని విద్యార్థులకు ఇది చివరి అవకాశమని ప్రభుత్వం ప్రకటించింది.

ఇందులో భాగంగా లోకల్ విద్యార్థులకు సెప్టెంబర్ 24, 25, 26 తేదీల్లో, నాన్-లోకల్ విద్యార్థులకు 28, 29 తేదీల్లోపు స్పాట్ అడ్మిషన్ల ద్వారా డిగ్రీలో చేరేందుకు అవకాశం కల్పించింది.ఈ నేపథ్యంలో మహేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ మాట్లాడుతూ.. తమ కళాశాలలో సైన్స్ విభాగంలో దోస్త్ అడ్మిషన్ల అనంతరం మిగిలిన ఖాళీ సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఫిజికల్ సైన్స్, లైఫ్ సైన్సెస్ గ్రూపులలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు.డిగ్రీ కోర్సులో చేరడం ఇదే ఆఖరి అవకాశం కాబట్టి, ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 11 గంటల లోపు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలను సంప్రదించి అడ్మిషన్ పొందాలని కోరారు.

# కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి" అంటూ గణనాథుడికి ప్రత్యేక పూజలు





**– బాలాపూర్ మహాగణపతిని దర్శించుకున్న**

**– బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**మహేశ్వరం సెప్టెంబర్ 24 అనంత జనశక్తి న్యూస్**

కేసీఆర్ మళ్లీ సీఎం కావాలి అంటూ గణనాథుడికి ప్రత్యేక పూజలు కేటీఆర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన బాలాపూర్ మహాగణపతిని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు దర్శించుకున్నారు. మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి. సబితా ఇంద్రా రెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డిలతో కలిసి బాలాపూర్ గణేష్ మండపానికి చేరుకున్న కేటీఆర్ కు ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి మరియు ఉత్సవ కమిటీ సభ్యులు, మండప అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు.

అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం కేటీఆర్ మొక్కుకున్నారు. దర్శనం అనంతరం ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి కేటీఆర్ ను శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రసిద్ధ బాలాపూర్ లడ్డూను ప్రసాదంగా అందజేశారు.ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాలు, కులాలు, మతాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతుల పంటలు బాగా పండాలని, శాంతిభద్రతలు సక్రమంగా ఉండాలని వినాయకుడిని ప్రార్థించినట్లు తెలిపారు.ప్రజలంతా తమ పిల్లాపాపలతో సంతోషంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించిన కేటీఆర్, తెలంగాణకు మళ్లీ మంచి రోజులు వస్తాయనే పూర్తి నమ్మకం ఉందన్నారు. వినాయకుడి ఆశీస్సులతో రాష్ట్రానికి ఉన్న అన్ని విఘ్నాలు తొలగిపోయి, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నట్లు వెల్లడించారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బాలాపూర్ మహాగణపతిని దర్శించుకోవడంతో మండపం వద్ద భారీ సందడి నెలకొంది. పెద్ద ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు, భక్తులు తరలివచ్చారు.

## ఫ్యూచర్ సిటీ విలీనానికి సబితమ్మ అనుకూలం.. మరి సర్పంచులు వ్యతిరేకమా?



**- బీఆర్ఎస్ ది రెండు నాలుకల ధోరణి**

**- మహేశ్వరం అభివృద్ధిని అడ్డుకోవడమే లక్ష్యమా?***

**- ఐఎన్టీయూసీ మహేశ్వరం కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడి శివ ధ్వజం**

**మహేశ్వరం, సెప్టెంబర్ 24, ( అనంత జనశక్తి ):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టు విషయంలో బీఆర్ఎస్ పార్టీ కావాలనే రెండు నాలుకల ధోరణితో వ్యవహరిస్తూ మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడుతోందని ఐఎన్టీయూసీ మహేశ్వరం నియోజకవర్గ కార్మిక శాఖ అధ్యక్షులు నడికుడి శివ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.


సబితమ్మ ఒక మాట.. సర్పంచులు ఇంకో మాట:

ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం పరిధిలోని గ్రామాల విలీనం విషయంలో బీఆర్ఎస్ నాయకుల్లో స్పష్టత లేదని ఆయన విమర్శించారు. మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఒకవైపు మంత్రి శ్రీధర్ బాబు ని కలిసి ఫ్యూచర్ సిటీ విలీనానికి తాము అనుకూలమని లేఖ ఇచ్చామని బహిరంగంగా చెబుతున్నారు.కానీ అదే బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు మాత్రం జనరల్ బాడీ సమావేశాల్లో బిఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచులు ఫ్యూచర్ సిటీ విలీనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ విలీనానికి ఒప్పుకోబోమని తీర్మానాలు చేస్తున్నారు. ఇదేమి పద్ధతి అని నడికుడి శివ ప్రశ్నించారు.

**అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారు?**

మహేశ్వరం పరిధిలో ఉన్న గ్రామాలన్నీ ఫ్యూచర్ సిటీలో విలీనం అయితే రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, విద్య, వైద్యం, ఐటీ కంపెనీలు, పరిశ్రమలు వచ్చి వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని, భూముల రేట్లు పెరిగి రైతులు, సామాన్య ప్రజలు ఆర్థికంగా బలపడతారని మహేశ్వరం ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారని అన్నారు.ఇలాంటి అభివృద్ధిని అడ్డుకోవడం ద్వారా బీఆర్ఎస్ నాయకులకు వచ్చే లాభం ఏమిటని నిలదీశారు. ఫ్యూచర్ సిటీని అడ్డుకోవడమే బీఆర్ఎస్ పార్టీ లక్ష్యంగా పెట్టుకుందా? మీ రెండు నాలుకల ధోరణిని, అభివృద్ధి నిరోధక వైఖరిని మహేశ్వరం ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## దళితులకు భూమి ఉండకూడదా రెడ్లకే ఉండాలా..?



**- భూమి కోసం దళిత మహిళలని చూడకుండా బెదిరింపులు**

**- నా వారసత్వ భూమి పై నాకు హక్కు లేదా**

**- వారసత్వ భూమి కోసం దళిత ఒంటరి మహిళ న్యాయపోరాటం**

**- వక్ఫ్ గెజిట్ ను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించిన లక్ష్మి**

**- అండగా నిలవాలని వేడుకోలు**

**మహేశ్వరం, సెప్టెంబర్ 24, ( అనంత జనశక్తి ):**

దళితులకు భూమి ఉండకూడదా రెడ్లకే ఉండాలా..?అని మహేశ్వరం మండలం కొంగర ఖుర్ద్ఎ గ్రామానికి చెందిన లక్ష్మి ప్రశ్నించారు.

వారసత్వంగా వచ్చిన భూమి కోసం ఒక దళిత ఒంటరి మహిళ చేస్తున్న న్యాయపోరాటం మహేశ్వరం మండలంలో చర్చనీయాంశంగా మారింది.మహేశ్వరం మండలం కొంగర ఖుర్ద్ఎ గ్రామానికి చెందిన లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం, సుమారు 5060 ఏళ్ల క్రితం తన తండ్రి సత్యనారాయణకు కొంత భూమి లభించింది. ఆ భూమికి సంబంధించిన పాత పత్రాలన్నీ తన వద్ద భద్రంగా ఉన్నాయని ఆమె తెలిపారు. తండ్రి మృతి చెంది సుమారు 20 ఏళ్లు అవుతోందని, తాను ఆయనకు ఏకైక కుమార్తెనని చెప్పారు.15 ఏళ్ల క్రితం తండ్రి బ్యాగులో ఆ భూమి పత్రాలు లభించడంతో, తన హక్కును కాపాడుకునేందుకు రెవెన్యూ అధికారులను, న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, న్యాయస్థానం తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని లక్ష్మి వెల్లడించారు. అయితే కోర్టు ఉత్తర్వులు చేతిలో ఉన్నప్పటికీ, భూమిపైకి వెళ్లేందుకు ప్రయత్నించగా కొంతమంది వ్యక్తులు అడ్డుకుని, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు.

**వక్ఫ్ గెజిట్ పై హైకోర్టులో పిటిషన్:**

ఈ భూమి వివాదంలో కీలక మలుపు వక్ఫ్ గెజిట్. కొంగర ఖుర్ద్ఎ గ్రామంలోని సర్వే నంబర్లు 49, 50, 51, 52, 54, 55, 56, 57, 193, 194 లలోని సుమారు 17 ఎకరాల భూమిని 08.02.2007న వెలువడిన వక్ఫ్ గెజిట్ అదనపు నోటిఫికేషన్ లో చేర్చడాన్ని సవాల్ చేస్తూ లక్ష్మి హైకోర్టును ఆశ్రయించారు.ఈ కేసులో 2026 మే 4న విచారణ జరగ్గా, పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి కీలక విషయాన్ని తీసుకువచ్చారు. ఇదే అంశంపై, ఇదే గెజిట్ ను గతంలోనే హైకోర్టు రద్దు చేసిందని తెలిపారు. http://W.P.No.7567/2022 లో 18.07.2024న, అలాగే హెచ్టిటిపి :// డబ్ల్యూ టి పి నెంబర్ .19341/2024 లో 10.09.2024న హైకోర్టు ఇదే వక్ఫ్ గెజిట్ ను రద్దు చేస్తూ స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చిందని కోర్టుకు నివేదించారు.

అయినప్పటికీ అధికారులు తమ భూమిని ఇప్పటికీ నిషేధిత జాబితాలోనే ఉంచారని, దీంతో తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని లక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు.తన కుటుంబం దళిత వర్గానికి చెందినదని, తన వెనుక ఎవరూ లేరు అనే ఉద్దేశంతోనే కొందరు తన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, కులం పేరుతో దూషిస్తూ మానసికంగా వేధిస్తున్నారని కన్నీటి పర్యంతమయ్యారు. కోర్టు తీర్పు ఉన్నా అమలు కావడం లేదని, జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులు స్పందించి తన వారసత్వ భూమిని తనకు అప్పగించి న్యాయం చేయాలని ఆమె వేడుకుంటున్నారు.

## నేడే నిమజ్జనం

**హైదరాబాద్, అనంత జనశక్తి న్యూస్**

హైదరాబాద్ మహా నగరంలో గణేష్ మహా నిమజ్జనానికి సర్వం సిద్ధం అవుతోంది. ఖైరతాబాద్ మహా గణపతి సహా వేలాది విగ్రహాలు శుక్రవారం రోజున గంగమ్మ ఒడికి చేరనున్నాయి. ఈ నిమజ్జనాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. నగరంలోని ప్రధాన రహదారులు, నిమజ్జన మార్గాల్లో భారీగా భక్తులు, గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, ప్రజా రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ క్రమంలో నగరవాసులకు ఇబ్బందులు తగ్గించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గణేష్ నిమజ్జనానికి వచ్చే భక్తులకు హైదరాబాద్ మెట్రో శుభవార్త చెప్పింది. శుక్రవారం రోజున మెట్రో రైలు సేవలు అర్ధరాత్రి 1 గంట వరకు పొడిగిస్తున్నట్లు తెలిపింది. అన్ని టెర్మినల్ స్టేషన్ల నుంచి చివరి మెట్రో రైలు రాత్రి 1 గంటకు బయలుదేరుతుందని పేర్కొంది. ప్రస్తుతం రాత్రి 11 గంటలకు చివరి రైలు స్టేషన్ నుంచి బయలుదేరుతుండగా.. నిమజ్జనాల సందర్భంగా మరో 2 గంటలు అదనంగా మెట్రో రైళ్లు నడవనున్నాయి. నిమజ్జనం సందర్భంగా ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ రద్దీ, వాహనాల మళ్లింపులు, పార్కింగ్ సమస్యలు ఉండే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో సొంత వాహనాల కంటే మెట్రో వంటి ప్రజా రవాణాను వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. నిమజ్జన వేడుకలు చూసేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఈ పొడిగించిన మెట్రో సేవలు ఉపయోగపడనున్నాయి.

నిమజ్జన శోభాయాత్రలు ప్రశాంతంగా జరిగేలా మద్యం విక్రయాలపై కూడా ఆంక్షలు విధించారు. పలు పోలీస్ కమిషనరేట్ల పరిధిలో సెప్టెంబర్ 25వ తేదీ ఉదయం 6 గంటల నుంచి సెప్టెంబర్ 26వ తేదీ ఉదయం 6 గంటల వరకు వైన్ షాపులు, కల్లు దుకాణాలు, రెస్టారెంట్లకు అనుబంధంగా ఉన్న బార్లను మూసివేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే స్టార్ హోటళ్లలోని బార్లు, రిజిస్టర్డ్ క్లబ్బులకు ఈ మద్యం ఆంక్షల నుంచి మినహాయింపు ఇచ్చారు. నిమజ్జన సమయంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

గణేష్ నిమజ్జనాన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 25వ తేదీన హైదరాబాద్‌సికింద్రాబాద్ జంట నగరాలతో పాటు రంగారెడ్డి, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 25వ తేదీ సెలవుకు బదులుగా నవంబర్ 14వ తేదీ రెండో శనివారాన్ని పనిదినంగా పరిగణించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

**దీంతో నిమజ్జనం రోజున రోడ్లపై రద్దీని కొంతమేర తగ్గించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకున్నట్టయింది. నిమజ్జన శోభాయాత్రలు, ట్రాఫిక్ రద్దీ నేపథ్యంలో హైదరాబాద్, సికింద్రాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి పరిధిలోని సబార్డినేట్ కోర్టులకు కూడా సెప్టెంబర్ 25వ తేదీన సెలవు ప్రకటించారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఉత్తర్వులు జారీ చేశారు.**

## గుమ్మడవెల్లిలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

**కందుకూరు, సెప్టెంబర్ 24 ( అనంత జనశక్తి):**

కందుకూరు మండలం గుమ్మడవెల్లి గ్రామంలో గణేష్ నిమజ్జన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని నాలుగు వినాయక విగ్రహాలకు కురుమ సంఘం ఆధ్వర్యంలో తొమ్మిది రోజుల పాటు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం బుధవారం భక్తుల సమక్షంలో భారీ శోభాయాత్ర నిర్వహించి, గంగాదేవి జలాశయంలో గణనాథులను నిమజ్జనం చేశారు.ఈ శోభాయాత్రలో భక్తులు, యువకులు, గ్రామ ఆడపడుచులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలు, కోలాటాలు, నృత్యాలతో గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు. దీంతో గ్రామమంతా భక్తి, ఆనందోత్సవాలతో సందడిగా మారింది.

గత మూడు సంవత్సరాల నుండి లడ్డూ ప్రసాదాన్ని తుంట కుమార్ స్వీకరిస్తుండగా, ఈ ఏడాది రూ.85 వేలకు లడ్డూ ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన ప్రతి పంతులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, భక్తులకు నిర్వాహకులు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.



# పుట్టపర్తి ఆర్టీసీ డిపో వద్ద 'సాయి గోకులం పార్క్, ఫుడ్ కోర్ట్' ఘన ప్రారంభం

- ఆర్టీసీ డిపో వద్ద అధునాతన పార్క్, ఫుడ్ కోర్ట్‌ను లాంఛనంగా ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి
- పట్టణవాసులు, సందర్శకులకు ఇక ఆహ్లాదంతో పాటు నోరూరించే రుచులు అందుబాటులో



పుట్టపర్తి,సెప్టెంబర్,24:అనంత జనశక్తి న్యూస్

శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ డిపో సమీపంలో నూతనంగా నిర్మించిన 'సాయి గోకులం పార్క్' మరియు 'ఫుడ్ కోర్ట్' గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్, పుట్టపర్తి శాసనసభ్యురాలు పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వీటిని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పుట్టపర్తి పట్టణ ప్రజలతో పాటు ఇక్కడికి వచ్చే యాత్రికులకు ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణాన్ని అందించేందుకు ఈ పార్క్‌ను తీర్చిదిద్దినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా వచ్చి సమయం గడిపేలా పార్క్‌లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించారని, అలాగే సందర్శకులకు నాణ్యమైన ఆహారం అందుబాటులో ఉండేలా ఫుడ్ కోర్ట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు.పట్టణ సుందరీకరణ లో భాగంగా ఆర్టీసీ డిపో వద్ద ఈ ప్రాజెక్ట్‌ను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పట్టణవాసులు, పర్యాటకులు ఈ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీఓ,మున్సిపల్ ప్రత్యేక అధికారి సువర్ణ,పుట్టపర్తి మున్సిపల్ కమీషనర్ జి. శ్రీనివాసులు,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు, పుట్టపర్తి పట్టణ ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దళితులపై దాడులకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు సాకే. వినయ్ కుమార్.



ధర్మవరం సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్:

రాష్ట్రంలో దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, హత్యాయత్నాలు, అత్యాచారాలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు, జిల్లా కార్యదర్శి మాల్యావంతం రాంప్రసాద్ తదితరులు మాట్లాడుతూ.... చంద్రబాబు ప్రభుత్వం దళితుల రక్షణలో విఫలమైందని బీఎస్పీ నాయకులు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రంలో వరుసగా ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఏడుగురాళ్లపల్లిలో 14 మంది మైనర్ బాలికపై అత్యాచారానికి పాటు, రాష్ట్రవ్యాప్తంగా 27 మంది హత్యకు గురైన ఘటనలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

మడకశిర నియోజకవర్గం మందలపల్లిలో విజయభాస్కర్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు. సాధారణ మరణంగా చిత్రీకరించారనే ఆరోపణలపై, అలాగే పోస్టుమార్టం విషయంలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరిపి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలోని దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలు, హత్యాయత్నాలు, ఇతర ఘటనలపై ఇప్పటికే విజయవాడలో లోక్‌భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించి, అనంతరం గవర్నర్‌ను కలిసి సమస్యలను వివరించి న్యాయం చేయాలని కోరినట్లు బీఎస్పీ నాయకులు తెలిపారు.అయినా ప్రభుత్వం స్పందన తగిన స్థాయిలో లేదని విమర్శిస్తూ, దళితుల ప్రాణాలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలి,బాధితులకు న్యాయం చేయాలి.. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో సెప్టెంబర్ నెల 28వ తేదీ సోమవారం పుట్టపర్తి రెవెన్యూ భవన్ వద్ద దళితుల మరో పోరాటం పేరుతో బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.ధర్మవరం నియోజకవర్గం నుంచి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, బహుజన ప్రజలు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి తరలివచ్చి ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు పెద్దింటి కదరయ్య, రామాంజనేయులు, గిరి తదితరులు పాల్గొన్నారు.

# ఇండస్ట్రియల్ విజిట్ విద్యార్థులకు ఉపయోగకరం




-ప్రిన్సిపాల్ సురేష్ బాబు.

ధర్మవరం సెప్టెంబరు 24, అనంత జనశక్తి న్యూస్:

ఇండస్ట్రియల్ విజిట్ అనేది విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏపీ మోడల్ స్కూల్ చెన్నేకొత్తపల్లి విద్యార్థులు, ఉపాధ్యాయులు ధర్మవరం లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా సందర్శించిందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు కళాశాలలోని వివిధ సాంకేతిక విభాగాలు, పరికరాలు, ప్రయోగశాలలు మరియు సాంకేతిక విద్యకు సంబంధించిన అంశాలను అధికారులు, అధ్యాపకులు వివరించారు.విద్యార్థులు వివిధ సాంకేతిక అంశాలను ఆసక్తిగా పరిశీలించి, తమ సందేహాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఇండస్ట్రియల్ విజిట్ విద్యార్థులకు సాంకేతిక విద్యపై అవగాహన పెంపొందించడంతో పాటు, భవిష్యత్‌లో ఉన్నత విద్య , ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించిందని చెన్నై కొత్తపల్లి మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు.

# దివ్యాంగుడికి అండగా ఎమ్మెల్యే ..

- దివ్యాంగుని వీల్ చైర్ ను అందజేస్తున్న మండల అధికారులు..




గాండ్లపెంట, సెప్టెంబర్,24, అనంత జనశక్తి న్యూస్,

దివ్యాంగుడైన నాగరాజు కష్టాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ గుర్తించి ఆయనకి అండగా నిలిచారు.మండల కేంద్రానికి చెందిన సెట్టప్ప కుమారుడు నాగరాజు దివ్యాంగుడు కావడంతో మంచానికే పరిమితమై ఉన్నారు. నాగరాజు పరిస్థితిని ఆదరణ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు నాగేష్ ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వెంటనే స్పందించి నాగరాజుకు వీల్‌చైర్‌ను అందజేయాలని సూచించారు.ఎమ్మెల్యే స్పందనతో ఆదరణ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులు నాగేష్, అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సై సుమతి తహసిల్దార్ శ్రీనివాసులు ఎంపీడీవో రామకృష్ణ గురువారం నాగరాజుకు వీల్‌చైర్‌ను అందజేశారు. ఆదరణ డెవలప్మెంట్ టెస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అధికారులు వారిని ప్రశంసించారు. ఏడిటీ ఆధ్వర్యంలో రక్తదాతలు సేకరణ మరియు వితరణ అమ్మ ప్రశాంత నిలయం వృద్ధాశ్ర మము నిర్వహణ అక్షరాభ్యాస కేంద్రాలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని అధికారులు ఆయనకు అభినందించారు.నాగరాజు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో ఇలాంటి వారు ఎవరైనా ఉంటే గుర్తించి ఆదరణ డెవలప్మెంట్ టెస్ట్ నిర్వహణకు సమాచారం ఇవ్వాలని నిర్వాహకులు నాగేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదరణ డెవలప్మెంట్ ట్రస్ట్ అధ్యక్షులు మద్దిమడుగు నాగేష్, ఏడిటి సభ్యులు వాస్తు వెంకటేష్ నాయక్ ,వేమా ప్రసాద్ నాగరాజు పాల్గొన్నారు..

# భూమి వివాదాస్పద ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలి..



- నరసింహ గౌడ్.

గాండ్లపెంట, సెప్టెంబర్ 24, అనంత జనశక్తి న్యూస్

మండల కేంద్రంలోని 901 సర్వే నంబర్‌లో వివాదాస్పదంగా ఉన్న భూమిలో చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే నిలిపివేసి తమకు న్యాయం చేయాలని భూమికి సంబంధించిన యజమానులు నరసింహ గౌడ్, పాలకొండయ్య, వెంకటసుబ్బమ్మ డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో తమ సమస్యను వివరించారు.
తమ పూర్వీకులకు సంబంధించిన 901 సర్వే నంబర్‌లో మొత్తం 6.21 సెంట్ల భూమి ఉండగా, అందులో 4.72 సెంట్ల భూమిని విక్రయించామని తెలిపారు. మిగిలిన 1.79 సెంట్ల భూమి తమ పెద్దల పేర్లపై ఉందన్నారు. అయితే ఈ భూమిలో సుమారు ఒకటిన్నర ఎకరా మేర ఇతరులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆరోపించారు. మిగిలిన 29 సెంట్ల భూమిలో కూడా ఇతరులు ప్లాట్లు వేసి విక్రయించారని తెలిపారు ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టరాదని పంచాయతీ అధికారులకు పలుమార్లు తెలియజేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. ప్రస్తుతం భూ వివాదం ఆర్డీవో కోర్టులో విచారణలో ఉన్నప్పటికీ కొందరు దౌర్జన్యంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. తహసీల్దార్ సైతం నోటీసులు జారీ చేసినప్పటికీ నిర్మాణాలు కొనసాగుతున్నాయని తెలిపారు.
వివాదం పరిష్కారం కాకముందే నిర్మాణాలు చేపట్టడం వల్ల భవిష్యత్తులో మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వానికి, గ్రామపంచాయతీకి రావాల్సిన ఆదాయానికి కూడా నష్టం వాటిల్లే పరిస్థితి ఉందన్నారు. తమ పేర్లపై ఉన్న భూమి విషయంలో అధికారులు రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.
ఆర్డీవో కోర్టులో కేసు ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, వివాదాస్పద భూమిలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని నరసింహ గౌడ్, పాలకొండయ్య, వెంకటసుబ్బమ్మ కోరారు. అధికారులు స్పందించి తమ భూమికి సంబంధించిన సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## కాకుమాను రాజశేఖర్‌కు నివాళులు అర్పించిన మందకృష్ణ మాదిగ



ఎల్బీనగర్ సెప్టెంబర్ 24 ( అనంత జనశక్తి న్యూస్

వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ లిడ్ క్యాప్ చైర్మన్, మాదిగ సామాజిక వర్గానికి చెందిన నేత కాకుమాను రాజశేఖర్ గురువారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎల్బీ నగర్, డాక్టర్ కాలనీలో ఉన్న రాజశేఖర్ నివాసానికి ఎంఆర్పీఎస్ అధినేత పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వెళ్లి ఆయన భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాజశేఖర్ భౌతిక దేహాన్ని చూసి మందకృష్ణ మాదిగ భావోద్వేగానికి గురై కన్నీరు పెట్టుకున్నారు. అనంతరం రాజశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆయన సతీమణిని ఓదార్చి, రాజశేఖర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా రాజశేఖర్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో పంచుకున్నారు.
ఈ కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గోవిందు నరేష్ మాదిగ, ఎంఆర్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామారావు శ్రీనివాస్, ఎంఎస్పీ సీనియర్ నాయకుడు బత్తిన సుధాకర్, మాదిగ ఎంఆర్పీఎస్ ఎల్బీ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎంఆర్పీఎస్ సీనియర్ నాయకులు చిట్టిపాక అశోక్, మంద శేఖర్, రాంబాబు, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూసారాంబాగ్ యువశక్తి ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు

మలక్ పేట్ సెప్టెంబర్ 24 అనంత జనశక్తి న్యూస్



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మూసారాంబాగ్ యువశక్తి, భాగ్యనగర్ ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వర స్వామి ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని, ప్రతి ఒక్కరి జీవితంలో శాంతి, ఆనందం, విజయాలు నిండాలని గణేశుడిని ప్రార్థించారు. తదనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో గౌర విజయకాంత్, భరత్ కుమార్, భానుచందర్, రోహన్, సుభాష్, శివారెడ్డి, భార్గవ్, నవీన్, బాలు, రవి, భీమ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ్ నగర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వినాయక చవితి వేడుకలు

ఖకళ్యాణ్ నగర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు వైభవంగా



జరిపారు. ఈ వేడుకల్లో భాగంగా సనాతన ధర్మ ప్రసంగాలు, భజన్ జామింగ్, హనుమాన్ చాలీసా పారాయణం, భరతనాట్యం, రంగోలి పోటీలు, 1,000 దీపాల కార్యక్రమం, రెండుసార్లు అన్నప్రసాద వితరణ, జానపద నృత్య కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం
కళ్యాణ్ నగర్ యువజన సంక్షేమ సంఘం తరపున ప్రజలందరికీ హృదయపూర్వక వినాయక చవితి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాయి కృష్ణ, శార్దూల్, దీపు, విశ్వాస్, శివ, సాయి, విఖిల్ పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేశారు.

## భారీ వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ గోడ

అనంతగిరి, సెప్టెంబర్24:అనంత జనశక్తి న్యూస్

అనంతగిరి మండలం పరిధిలోని చిలకలగెడ్డ ఎంపీపీ పాఠశాల ఆవరణలోని ప్రహరీ గోడ భారీ వర్షాలకు కూలిపోయింది. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోడ బలహీనపడి కూలినట్లు స్థానికులు తెలిపారు. గోడ కూలిన సమయంలో పాఠశాల ఆవరణలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నారు.విద్యార్థుల భద్రత దృష్ట్యా అధికారులు వెంటనే పాఠశాల ఆవరణను పరిశీలించి, కూలిన ప్రహరీ గోడకు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే ప్రమాదకరంగా ఉన్న ఇతర నిర్మాణాలను కూడా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



# అతడు నాకు సొంతమైనా క్రష్ తగ్గట్లేదు: రష్మిక ఎమోషనల్ పోస్ట్



విజయ్ దేవరకొండ , రష్మిక వైవాహిక బంధంలోకి అడుగుపెట్టిన తరువాత తొలిసారి జంటగా నటిస్తున్న చిత్రం 'రణబాలి' . సింగనమల బొబ్బిలి రణబాలిగా విజయ్ దేవరకొండ పవర్‌ఫుల్ పాత్రను పోషిస్తుండగా, ఆయన భార్యగా జయమ్మ పాత్రలో రష్మిక కనిపించనున్నారు. ఈ సినిమాలోని ఇప్పటికే విడుదల చేసిన 'ఏందయ్యా సామీ..' పాటకు మంచి స్పందన వస్తోంది. అందులో విజయ్, రష్మికల మధ్య కెమిస్ట్రీ ఆకట్టుకుంటోంది. తాజాగా ఆ పాట క్లిప్‌ను రష్మిక ఇన్‌స్టాలో పంచుకుంటూ, విజయ్‌పై తన ప్రేమను వ్యక్తం చేయడం విశేషం.

"అతడు పూర్తిగా నాకే సొంతమయ్యాడు. కానీ తనపై క్రష్ ఏమాత్రం తగ్గడం లేదు. ఇదేం విచిత్రమో" అని రష్మిక పోస్ట్ చేయగా, విజయ్ దీనికి తనదైన శైలిలో రిప్లై ఇచ్చారు. "నేను ఎంతో అదృష్టవంతుడిని. జయమ్మను మిస్ అవుతాను కానీ, నువ్వు జీవితాంతం నా దగ్గరే ఉంటావు" అని విజయ్ స్పందించారు. వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం చూసి నెటిజన్లు ముచ్చటపడుతున్నారు. ఇదిలా ఉండగా, రాహుల్ సాంకృత్యాన్ తెరకెక్కిస్తున్న 'రణబాలి' దసరా కానుకగా అక్టోబరు 16న విడుదల కానుంది.



# మూడేళ్ల విరామం.. వరుసగా మూడు సినిమాలు..



బాలీవుడ్ కథానాయకుడు రణ్‌బీర్ కపూర్ ఇప్పుడు ఫుల్‌జోష్‌లో ఉన్నారు. వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. మామూలు కథకు కూడా భారీదనం అద్ది వెండితెరపై ఆవిష్కరించడంలో సంజయ్ లీలా భన్సాలీ సిద్ధహస్తుడు. ఆయన దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్ నటిస్తోన్న రొమాంటిక్ డ్రామా 'లవ్ అండ్ వార్'. అలియా భట్, విక్కీ కౌశల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ మూవీ విడుదల తేదీని తాజాగా ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 21న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. రణ్‌బీర్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో కనిపించే గ్రాండ్ విజువల్స్, రిచ్‌నెస్ ఇందులోనూ ఉంటుందని ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది. హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ 'లవ్ అండ్ వార్'ను విడుదల చేయనున్నారు.

ఏడాదిలో మూడు సినిమాలు..

రణ్‌బీర్ చివరిగా 2023లో 'యానిమల్'తో పలకరించారు. సందీప్‌వంగా దర్శకత్వంలో వచ్చిన ఆ మూవీ బాక్సాఫీస్ వద్ద ఘన విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత 'రామాయణ'తో రణ్‌బీర్ బిజీ అయ్యారు. ఇది రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పార్ట్-1 చిత్రీకరణ పూర్తి కాగా, తుది మెరుగులు దిద్దుకుంటోంది. దీపావళి కానుకగా ఈ ఏడాది నవంబరులో ఈ మూవీ విడుదల కానుంది. సాయిపల్లవి సీతగా నటిస్తున్న ఈ చిత్రానికి నితేశ్ తివారీ దర్శకత్వం వహించారు. ఇక, జనవరి 21న 'లవ్ అండ్ వార్' రానుంది. మళ్లీ వచ్చే ఏడాది దీపావళికి 'రామాయణ: పార్ట్2'ను తీసుకురానున్నారు. దానికి సంబంధించిన చిత్రీకరణ చాలా వరకూ పూర్తయింది. మిగిలిన షూటింగ్‌ను కూడా త్వరలోనే పూర్తి చేసి, పోస్ట్ ప్రొడక్షన్ పనులకు ఎక్కువ సమయం కేటాయించనున్నారు. అంటే ఏడాది కాలంలో మూడు సినిమాలతో రణ్‌బీర్ అలరించనున్నారు.

# పోకిరి, సచిన్.. దేనికి సీక్వెల్ తీస్తారు?: విజయ్ కుమారుడు ఏమన్నారంటే





తమిళ అగ్రకథానాయకుడు విజయ్ కుమారుడు జాసన్ సంజయ్ త్వరలోనే దర్శకుడిగా పరిచయం కానున్న విషయం తెలిసిందే. 'సిగ్మా'తో మెగాఫోన్ పట్టారు. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో సంజయ్‌కు ఓ ఆసక్తికర ప్రశ్న ఎదురైంది. విజయ్ నటించిన పోకిరి, సచిన్ సినిమాల్లో దేనికి సీక్వెల్ తీస్తారని ప్రశ్నించగా ఆయన రెండూ కాదని మరో సినిమాను ఎంచుకున్నారు. మాస్ యాక్షన్ మూవీ పోకిరి , ప్రేమ కథాచిత్రం సచిన్ ఈ రెండిటినీ కాకుండా బ్లాక్‌బస్టర్ స్పోర్ట్స్ డ్రామా 'బద్రి'కి సీక్వెల్ తీస్తానని అన్నారు. ఆ సినిమాలో హీరో పాత్రకు ప్రత్యేకమైన ఆత్మ విశ్వాసం ఉంటుందని అందుకే ఆ చిత్రానికి సీక్వెల్ తీస్తానని తెలిపారు. ఇక తన చిన్ననాటి జ్ఞాపకాలను సంజయ్ గుర్తుచేసుకున్నారు. చిన్నప్పుడు తన తండ్రితో కలిసి ఎన్నో సినిమాలు చూసినట్లు చెప్పారు. వాటిలో పోకిరి సినిమా రోజులు తనకు ఎప్పటికీ గుర్తుంటాయని అన్నారు. విజయ్, అజిత్ చిత్రాలు ఒకేసారి బాక్సాఫీస్ వద్ద పోటీ పడినప్పుడు సందడిగా ఉంటుందన్నారు. తెలుగులో సూపర్ హిట్ అయిన పలు చిత్రాలను విజయ్ తమిళంలో రీమేక్ చేసిన విషయం తెలిసిందే. 2006లో వచ్చిన పోకిరిని అదే పేరుతో 2007లో తమిళంలో రీమేక్ చేశారు. తెలుగులో వచ్చిన 'నీతో' సినిమాను సచిన్ పేరుతో విజయ్ రీమేక్ చేశారు. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తమ్ముడు సినిమాను తమిళంలో విజయ్ 'బద్రి' పేరుతో తీశారు. ఇది అక్కడ కూడా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకే జాసన్ సంజయ్ సీక్వెల్ తీస్తానని వెల్లడించారు. ఇక జాసన్ సంజయ్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన 'సిగ్మా' అక్టోబర్ 2న విడుదల కానుంది

# విరాట్‌రోహిత్.. 2027 ప్రపంచకప్ గెలవాలి: రింకు సింగ్




వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌లో స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఆడుతారా? అనే దానిపై కొంతకాలంగా చర్చ జరుగుతూనే ఉంది. ప్రతిష్ఠాత్మక టోర్నీకి వీరిని విస్మరించొద్దని కొందరు సూచిస్తుండగా.. యువ ఆటగాళ్లకు అవకాశం ఇవ్వాలనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. దీంతో రో-కో భవిష్యత్తుపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో టీమ్‌ఇండియా బ్యాటర్ రింకు సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. విరాట్-రోహిత్ కలిసి 2027 వన్డే ప్రపంచకప్ నెగ్గితే చూడాలని ఉందని ఆకాంక్షించాడు.

"విరాట్ భాయ్, రోహిత్ భాయ్.. ఇద్దరూ లెజెండ్స్. వీరు ప్రపంచకప్‌లో ఆడాలని, ట్రోఫీ గెలుచుకునే జట్టులో భాగంగా ఉండాలని నేను మాత్రమే కాదు.. యావత్ దేశం ఆశిస్తోంది. అదే జరిగితే దేశం మొత్తానికీ అదో గొప్ప క్షణం అవుతుంది. ఎందుకంటే ఇదే వారికి చివరి ప్రపంచకప్ (2027కావొచ్చు. ఇక, మనం చాలా కాలంగా వన్డే ప్రపంచ కప్‌ను అందుకోలేదు. చివరిసారిగా 2011లో జరిగిన మెగా టోర్నీలో విజయం సాధించాం. ఇప్పుడు గెలిస్తే రో-కోకి కూడా గొప్పగా ఉంటుంది. అందువల్ల వీరిద్దరూ జట్టులో ఉండి, దేశానికి ట్రోఫీ అందిస్తారని ఆశిస్తున్నా" అని రింకు వ్యాఖ్యానించాడు. 2024లో పొట్టి ప్రపంచకప్ గెలిచి సంతోషంగా, సంతృప్తిగా అంతర్జాతీయ టీ20లకు గుడ్‌బై చెప్పారు రో-కో. ఆ తర్వాత ఏడాదిలోనే టెస్టులకూ వీడ్కోలు పలికారు. అప్పటి నుంచి మిగిలిన ఏకైక ఫార్మాట్ వన్డేల్లో వీరు ఎంతకాలం కొనసాగుతారనే ప్రశ్నలు ఎదురవుతూనే ఉన్నాయి. వయసు, ఫిట్‌నెస్‌ను పరిగణనలోకి తీసుకుంటే వచ్చే ఏడాది వీరిని వన్డే ప్రపంచకప్‌లోకి తీసుకుంటారా? లేదా అనేదానిపై సందేహాలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇటీవల రోహిత్ రిటైర్మెంట్ ప్రకటిస్తాడనే వార్తలూ వినిపించాయి. వాటికి చెక్ పెడుతూ లార్డ్స్‌లో శతకంతో అదరగొట్టాడు హిట్‌మ్యాన్. ఈ నెలాఖరులో సొంతగడ్డపై వెస్టిండీస్‌తో జరిగే వన్డే సిరీస్‌లో వీరిద్దరూ ఆడనున్నారు.

కోహ్లీ ఇప్పటి వరకు 314 వన్డేల్లో 14,941 పరుగులు సాధించాడు. ఇందులో 54 సెంచరీలు, 79 అర్ధశతకాలున్నాయి. రోహిత్ 288 వన్డే మ్యాచుల్లో 11,895 పరుగులు చేశాడు. ఇందులో 34 సెంచరీలు, 62 అర్ధశతకాలు ఉన్నాయి. ఈ ఏడాది ఆరు ఇన్నింగ్స్ ఆడిన విరాట్.. 106 స్ట్రైక్ రేటుతో 384 పరుగులు చేశాడు. రోహిత్ 9 ఇన్నింగ్స్‌ల్లో 379 పరుగులు నమోదు చేశాడు.

# గన్ పేలింది కానీ..

- పిస్టల్‌లో నిరాశపరిచిన మను, ఇషా
- స్కీట్‌లో భారత్‌కు రెండు కాంస్యాలు



ఆసియా క్రీడల ఆరంభం నుంచి పతకాల వేటలో ముందున్న షూటింగ్‌లో నాలుగో రోజు కూడా రెండు పతకాలు వచ్చాయి. కానీ ఆనందం మాత్రం సగమే. ఎందుకంటే కచ్చితంగా మెడల్స్ తెస్తారన్న అంచనాలు ఉన్న మను బాకర్, ఇషా సింగ్ అనూహ్యంగా విఫలమయ్యారు. ఆ బాధకు కాస్త మందు పూస్తూ స్కీట్‌లో భారత షూటింగ్ టీమ్‌లు రెండు కాంస్యాలు గెలుచుకున్నాయి. పురుషుల టీమ్‌లో అనంత్‌జీత్ సింగ్ నరుకా, మైరాజ్ అహ్మద్, భవ్‌తేగ్ సింగ్‌లతో కూడిన భారత బృందం 331 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఖతార్ (353), కువైట్ (348) వరుసగా స్వర్ణ, రజత పతకాలు సాధించాయి. మహిళల టీమ్ విభాగంలో భారత్ (రైజా ఢిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్) జట్టు 331 పాయింట్లతో కాంస్యం గెలుచుకుంది. చైనా (357) స్వర్ణం, కజకిస్థాన్ (336) రజతం సాధించాయి.

పిస్టల్‌లో విఫలం: పిస్టల్ 10 మీటర్ల విభాగంలో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ అయిదో స్థానంతో సరిపెట్టుకుంది.ఆమె ఫైనల్లో 181.1 పాయింట్లు మాత్రమే సాధించింది. క్వాలిఫికేషన్లో 579 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచి ఫైనల్ చేరిన మను.. ఆఖరి పోరులో తడబడింది. తొలి అయిదు షాట్ల తర్వాత 50.8 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న ఆమె.. తర్వాత పతక రేసులో వెనుకబడిపోయింది. మరోవైపు కచ్చితంగా పతకం తెస్తుందని ఆశించిన హైదరాబాదీ అమ్మాయి ఇషా సింగ్ క్వాలిఫికేషన్లో 572 పాయింట్లతో 15వ స్థానానికి పరిమితమైంది. మరో భారత షూటర్ సురుచి సింగ్ (568).. 26వ స్థానంలో నిలిచింది. వ్యక్తిగత విభాగం క్వాలిఫయింగ్‌లో పేలవ ప్రదర్శన కారణంగా టీమ్ విభాగంలోనూ భారత్‌కు పతకం దక్కలేదు. మను బాకర్, ఇషా సింగ్, సురుచి సింగ్‌లతో కూడిన భారత బృందం మొత్తంగా 1719 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU, ASSOCIATE EDITOR MARUTHI BIKSHA REDDY Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945